teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే

ప్రజలకు లబ్ధి చేకూరే కోణంలో నిర్ణయాలకు ఆదేశాలు జారీ



హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు లబ్ధి చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యమైతేనే సరైన సేవలు అందించవచ్చన్నారు. కలెక్టర్ల బదిలీలను పారదర్శకంగా నిర్వహించామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు ఉండాలని కలెక్టర్లకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఆలోచన ఏంటో తెలుసుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ.. ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందని రేవంత్ రెడ్డి కలెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు.

ములుగు | సంపుటి : 03 | సంచిక : 85 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 17 జూలై 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

# కష్టాల కొలిమిలో కౌలు రైతులు



### పంట వేసింది మొదలు నష్టాలే

### భూ హక్కులు లేకపోవడంతో తిప్పలు

కౌలురైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర రంగాలకు చెందిన వారికి వ్యవసాయం చేసే ఆసక్తి లేకపోవడంతో పాటు సాగు కష్టాలను ఎదుర్కొనే పరిస్థితులు లేక తమ భూములను కౌలుకు ఇచ్చేస్తుంటారు. ప్రభుత్వం ఎకరాకు రూ.5వేల చొప్పన రెండు విడతలుగా అందిస్తున్న రైతుబంధు సాయం పట్టాదారైన రైతుల ఖాతాల్లోనే జమ అవుతోంది. పంటను సాగు చేసిన కౌలు రైతు పేరు ఎక్కడా లేకుండా పోయింది.

తెలంగాణ బ్యూరో, జులై 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధులో కౌలు రైతు ఊసే లేకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పంటలు సాగు చేసి ఎరువులు, కలుపు తీయాల్సిన పరిస్థితుల్లో పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులు సైతం కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. గతంలో కౌలు రైతులకు రుణ అర్హత కల్గిన కార్డులను జారీ చేసేవారు. కొత్తగా జారీ చేసిన డిజిటల్ పాస్ పుస్తకాల్లో పట్టాదారు పేరు మినహా ఇతర కాలం ఎక్కడా లేదు. దీంతో కౌలు రైతులకు శాశ్వతంగా

మిగతా 2 లో





# రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దు

### ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆరోగ్యశ్రీపై సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ఉందన్నారు. ఇందుకు సంబంధించి అధ్యయనం చేసి కొత్త జీవో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. రూరల్ ఏరియాలో పనిచేసే వైద్యులకు పారితోషికం ఎక్కువ అందించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

తెలంగాణ బ్యూరో, జులై 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్ కు ఒక సీరియల్ నెంబర్ ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్స్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక వ్యవస్థ ఉండేలా చూడాలన్నారు. స్థానికంగా స్వచ్ఛంద సంస్థల సహకారం, పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు తీసుకోవాలని, వ్యాపార వాణిజ్యవేత్తల భాగస్వామ్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ మెరుగుపరిచే విధానాన్ని అవలంబించాలని

మిగతా 2 లో



## విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ చైర్మన్ ను మార్చాల్సిందే

విచారణ కమిటీ నియామకంలో పరిధిని అతిక్రమించారు

విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై న్యాయ విచారణ ఎలా?:సుప్రీంకోర్టు

రేవంత్ రెడ్డి సర్కార్‌పైన కెసిఆర్ తొలి విజయం

.. వివరాలు 2లో



## కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

.. వివరాలు 2లో

# ఈ నెల 18న ప్రారంభంకానున్న డీఎస్సీ పరీక్షలు

### ఇప్పటికి 2.20 లక్షల మంది హాల్ టికెట్ల డౌన్‌లోడ్


### 2.79 లక్షల మంది దరఖాస్తు

### 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



తెలంగాణ బ్యూరో, జులై 16 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో గురువారం నుంచి డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. వీటికి సంబంధించిన ఏర్పాట్లను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు పూర్తి చేశారు. ప్రతిరోజు పూటకు 13వేల మందికి పైగా

మిగతా 2 లో



# వివాదంగా మారుతోన్న మూసీ సుందరీకరణ

### బఫర్ జోన్లో మొదలైన ప్రైవేట్ ఆస్తుల వివరాల సేకరణ

హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): మూసీ బ్యూటిఫికేషన్ వివాదంగా మారుతోంది. రాబోయే మూడేళ్లలో గ్రేటర్ పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ ఆక్రమణలతో పాటు 50 మీటర్ల పరిధిలోని ఆస్తులను తొలగించి సుందరీకరణ చేపడతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో

మిగతా 2 లో



## పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

పార్టీ మారుటకు బెదిరిస్తున్నారంటు ఆరోపణలు

బడే భాయ్ - చోటే భాయ్‌కి తేడా ఏం లేదంటూ విమర్శలు

హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఈ పార్టీ ఫిరాయింపులకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2 లో



## తొలిసారి తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వుల జారీ సంతోషకరం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హర్షం వ్యక్తం

.. వివరాలు 2లో

# అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ అందిస్తాం

### రెండు మూడు రోజుల్లో జీవో జారికి సన్నాహాలు : మంత్రి సీతక్క




హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): అంగన్వాడీలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. నగరంలోని రహమత్ నగర్‌లో జరిగిన అమ్మ మాట- అంగన్వాడీ బాట కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ టీచర్‌కు రూ. 2లక్షలు, హెల్పర్‌కు రూ. 1లక్ష చొప్పున రిటైర్మెంట్ బెనిఫిట్స్

మిగతా 2 లో

# తిహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు అనారోగ్యం

### ఉన్నట్టుండి అస్వస్థతకు గురి

### స్పందించిన జైలు సిబ్బంది దీన్ దయాల్ హాస్పిటల్‌కు తరలింపు



న్యూ ఢిల్లీ, జులై 16 (తీన్మార్ న్యూస్): లిక్కర్ స్కామ్ కేసులో తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అనారోగ్యం బారినపడ్డారు. మంగళవారం ఉన్నట్టుండి ఆమె అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే స్పందించిన జైలు సిబ్బంది కవితను దీన్ దయాల్ హాస్పిటల్‌కు తరలించారు. ఆమె జ్వరంతో

మిగతా 2 లో

# రుణమాఫీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఈటెల

### షరతులు లేవంటూ హామీ ఇచ్చి.. షరతులు విధించడం మోసమే

### షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని ఈటెల డిమాండ్

హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు షరతులు విధించి రాష్ట్ర రైతులను మోసగిస్తున్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మార్గదర్శకాలు రైతులకు ఉరితాళ్లుగా మారాయన్నారు. మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2 లో






## రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచేసిన ప్రైవేట్ టెలికాం కంపెనీలు

సోషల్ మీడియాలో నిరాశను వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

.. వివరాలు 2లో

## విద్యుత్ కొనుగోళ్లపై కమిషన్ చైర్మన్ ను మార్చాల్సిందే

తెలంగాణ బ్యూరో, జులై 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు కొనుగోళ్ళు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలపై విచారణ కోసం జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ పైన మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసీఆర్ పిటిషన్ విచారించిన సుప్రీం ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. విద్యుత్ కొనుగోళ్ల అంశంలో వేసిన విచారణ కమిషన్ చైర్మన్ ను మార్చాల్సిందేనని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి నేతృత్వంలో రేవంత్ సర్కార్ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని విద్యుత్తు కొనుగోళ్ళు, థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలపై వేసిన కమిషన్ పైన కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ తన వాదనలు వినిపించారు. విద్యుత్ విచారణ కమిటీ నియామకంలో పరిధిని అతిక్రమించారని ఆయన ధర్మాసనం ముందు పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ఉండగా విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై న్యాయ విచారణ ఎలా వేస్తారని ప్రశ్నించారు. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ పైన కూడా ఆయన తనదైన వాదనలు ఆధారాలతో సహా వినిపించారు. ముఖ్యంగా ఆయన విచారణ జరగక ముందే పెట్టిన ప్రెస్ మీట్ పై ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. న్యాయం చెప్పాల్సిన జడ్జి విచారణకు ముందే ప్రెస్ మీట్ ఎలా పెడతారు అంటూ సీజేఐ ప్రశ్నించారు. దీంతో సిజెఐ ఆదేశాలతో విచారణ జడ్జిని మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒప్పుకుంది. సిజెఐ ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వానికి షాక్ తగిలినట్టు అయింది. కొత్త జడ్జి ఎవరైనా దానిపై మధ్యాహ్నం వరకు సమయం ఇచ్చింది సుప్రీం ధర్మాసనం. దీంతో కలెక్టర్ల మీటింగ్ నుంచి చాంబర్ కు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కొత్త జడ్జి ఎవరు అన్న అంశంతో సహా, ప్రస్తుతం ఉన్న కమిషన్ పైన సుప్రీంకోర్టు అభ్యంతరాలు, కేసీఆర్ తరపు న్యాయవాది లేవనెత్తిన పాయింట్స్ పైన చర్చిస్తున్నారు. మొత్తానికి తెలంగాణ సీఎం కేసీఆర్ కు తెలంగాణ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి ఒక గొప్ప విజయం దక్కింది. రేవంత్ రెడ్డి సర్కార్ పైన పోరాటం చేసిన కేసీఆర్ విద్యుత్తు కొనుగోళ్ల వ్యవహారంలో వేసిన కమిషన్ పైన సుప్రీంకోర్టును ఆశ్రయించి తెలంగాణా ఎన్నికల ఓటమి తర్వాత కేసీఆర్ తొలి విజయాన్ని అందుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా

తెలంగాణ బ్యూరో, జులై 16 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానన్న మాటకు కట్టుబడి ఉన్నానని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆగస్ట్ 15వ తేదీ నాటికి ఆరు గ్యారంటీలు, 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని చెప్పారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ రుణమాఫీ మార్గదర్శకాలతో రైతుల సంఖ్య తగ్గించేందుకు ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టిందని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులకంటే దారుణమైన నిబంధనలు తెచ్చారని విమర్శించారు. రేషన్ కార్డు లేకుంటే రుణ మాఫీ వర్తించదా, ఇది రైతులను మోసం చేయడమేనని చెప్పారు. ప్రజా పాలనలో రేషన్ కార్డులకు 7 నెలల కింద దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఆధార్ కార్డులు లేని రైతులు కూడా చాలా మంది ఉన్నారని తెలిపారు. నిజమైన రైతుకు రుణమాఫీ జరగాలంటే పాస్ బుక్ ఆధారంగా జరుగాలని అన్నారు. ఇక పీఎం కిసాన్ పథకం నిబంధనలు అమలు చేస్తే 60 శాతం మంది రైతులు అనర్హులుగా మారతారని చెప్పారు. రైతులకు అన్యాయం చేయడమే అవుతుందగని తెలిపారు. రైతులను అవమాన పరిచేలా ప్రభుత్వం నిబంధనలు తెచ్చిందని చెప్పారు. మాటలకు, చేతలకు ఈ ప్రభుత్వానికి పొంతన లేదని అన్నారు. రైతు ఆత్మహత్యలు ప్రతి రోజు ఎక్కడో ఒకచోట జరుగుతున్నాయని తెలిపారు. రుణమాఫీ చేయకపోతే తాము రైతుల తరపున ఆందోళన చేస్తామని, అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తామని హెచ్చరించారు.

## తొలిసారి తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వుల జారీ సంతోషకరం

హైదరాబాద్, జులై 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హర్షం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన మంగళవారం ట్విట్టర్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా పరిపాలనకు సంబంధించిన అంశాలు తెలుగులో జారీ చేయాలని తాను ఎప్పటి నుంచో సూచిస్తూనే ఉన్నానని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం తొలిసారి తెలుగులో, అందులోనూ రైతుల రుణమాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు వారికి సులువుగా అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించి ఇతర సమాచారం ఉండాలని తాను ఎప్పటినుంచో చెబుతున్నానని వివరించారు. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యమిస్తూ తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావుకి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇకనుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని ఆకాంక్షించారు.

## రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచేసిన ప్రైవేట్ టెలికాం కంపెనీలు

న్యూస్ ఢిల్లీ, జులై 16 (తీన్మార్ న్యూస్): ప్రైవేట్ టెలికాం కంపెనీలు ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో తమ రీఛార్జ్ ప్లాన్ ధరలను పెంచేశాయి. దీని వల్ల చాలా మంది యూజర్లు బీఎస్ఎన్ఎల్ కి మారారని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. ఈ ధోరణి మరింతగా పెరుగుతోంది. అనేకమంది ఎయిర్‌టెల్, జియో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌లను బీఎస్ఎన్ఎల్‌కి పోర్ట్ చేసుకుంటున్నారు. ఈ రెండు తమ ప్లాన్ ధరలను విపరీతంగా పెంచడంపై సోషల్ మీడియాలో చాలా మంది వినియోగదారులు తమ నిరాశను వ్యక్తం చేస్తున్నారు. ఇంతలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, బీఎస్ఎన్ఎల్ మధ్య ఇటీవల రూ.15,000 కోట్ల డీల్ కుదిరింది. ఇందులో భాగంగా టీసీఎస్, బీఎస్ఎన్ఎల్ కలిసి దేశం అంతటా 1,000 గ్రామాలకు 4జీ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నాయి. ఇది సమీప భవిష్యత్తులో వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తుంది. ప్రస్తుతం 4జీ ఇంటర్నెట్ సర్వీస్ మార్కెట్‌లో జియో, ఎయిర్‌టెల్ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అయితే బీఎస్ఎన్ఎల్ తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటే అది జియో, ఎయిర్‌టెల్‌లకు గణనీయమైన సవాలుగా మారవచ్చు. టాటా దేశం అంతటా నాలుగు ప్రాంతాలలో డేటా సెంటర్‌లను కూడా నిర్మిస్తోంది. ఇది దేశంలో 4జీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పడుతుంది. గత నెలలో జియో తమ రీఛార్జ్ ప్లాన్‌లలో ధరల పెంపును ప్రకటించింది. ఆ తర్వాత ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా ఇలాంటి ప్రకటనలు చేశాయి. వీటిలో జియో ధరల పెరుగుదల అత్యధికం. ఇది 12% నుంచి 25% వరకు ఉంది. ఎయిర్‌టెల్ ధరలు 11% నుంచి 21%, వొడాఫోన్ ధరలు 10% నుంచి 21% వరకు పెరిగాయి. కాగా సోషల్ మీడియాలో తీవ్రమైన విమర్శలు జియోపైనే ఉన్నాయి. చాలా మంది జియో యూజర్లు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

## ఈ నెల 18న ప్రారంభంకానున్న డీఎస్సీ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి

పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే హాల్ టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ మొదలుకాగా, సోమవారం మధ్యాహ్నం వరకు 2.20 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు.

**ప్రతిరోజూ 26వేల మందికి ఎగ్జామ్**

టీచర్ల పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీ ఎగ్జామ్స్ జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 2,79,956 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ కావడంతో ప్రతిరోజూ ఉదయం మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు పెడుతున్నారు. ఒక్కో షిఫ్ట్‌కు 13 వేల చొప్పున రోజుకు 26 వేల మందికి పైగా అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

**ఒక జిల్లా వారికి ఒకే రోజు**

డీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంట్లో భాగంగా ఒక జిల్లావారికి ఒకే రోజు పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎస్జీటీలతో పాటు సబ్జెక్టుల వారీగా ఇదే విధానం అమలు చేయనున్నారు. ఒక జిల్లాలో ఎక్కువ మంది అభ్యర్థులుంటే పక్క జిల్లాల్లో వారికి సెంటర్లు కేటాయించనున్నారు. తద్వారా నార్మలైజేషన్ చేసే అవకాశం రాకుండా ఉంటుంది. డీఎస్సీ పరీక్షలు ప్రారంభమయ్యే రోజున గురువారం స్కూల్ అసిస్టెంట్ (సోషల్, ఫిజికల్ సైన్స్) తెలుగు మీడియం పోస్టులకు మార్నింగ్ షిఫ్ట్ లో ఆఫ్టర్ నూన్ షిఫ్ట్ లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు ఎగ్జామ్ జరగనున్నది. చివరి రోజు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), లాంగ్వేజీ పండిట్ (హిందీ) పోస్టులకు పరీక్ష ఉంటుంది.

**హాల్ టికెట్లలో తప్పుల సవరణ**

డీఎస్సీ హాల్ టికెట్లలోని తప్పులను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు సవరిస్తున్నారు. డీఎస్సీ అప్లికేషన్లలో పేరు, డేటాఫ్ బర్త్ తో పాటు మీడియం, జిల్లా, జెండర్, సబ్జెక్టు పేర్లనూ కొందరు అభ్యర్థులు ఆన్ లైన్‌లో తప్పుగా ఎంట్రీ చేశారు. వారికి అప్లికేషన్ల ఎడిట్ ఆప్షన్ ఇచ్చినా, దాన్ని మార్చుకోలేదు. దీంతో హాల్ టికెట్లలో అలాగే వచ్చింది. దీంతో కొందరు అభ్యర్థులు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ కు వచ్చి సమస్యను అధికారులకు తెలిపారు. దీంతో వారి హాల్ టికెట్లను అప్‌డేట్ చేసి, మంగళవారం సాయంత్ర వరకు సవరించిన కొత్త హాల్ టికెట్లను వెబ్ సైట్‌లో పెడ్తామని వారికి సూచించారు.

## అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ అందిస్తాం

మొదటి పేజీ తరువాయి

అందజేస్తామని ఆమె వెల్లడించారు. దీనిపై రెండు మూడు రోజుల్లో జీవో జారీ చేస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. అలాగే సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జీలో మహిళా రైతులకు 50 శాతం రాయితీ ఇవ్వాలని, మహిళలు భూ యాజమానులయ్యేలా ప్రోత్సహించాలని మంత్రి సీతక్కకు మహిళా రైతు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చూస్తామని హామీనిచ్చారు. భూమి అంటే ఆర్థిక వనరే కాదు సమాజంలో గౌరవం, అధికారమని పేర్కొన్నారు.

భూమిపై మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జీల్లో మహిళలకు 50 శాతం రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

# కష్టాల కొలిమిలో కౌలు రైతులు

మొదటి పేజీ తరువాయి

అడ్డుకట్టపడింది. పెరుగుతున్న పెట్టుబడులు రోజురోజుకూ పంట పెట్టుబడులు పెరుగుతున్నాయి. సొంత భూములు లేక కౌలుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రభుత్వం గుర్తించడం లేదు. పంటసాగు పెట్టుబడి కోసం ప్రభుత్వం నుంచి సహకారం అందక, పండించిన పంట అధికారికంగా అమ్ముకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. భూ యజమానులకు మాత్రంముందుగానే చేతికి అందుతోంది. కష్టపడి పనిచేసే రైతులకు ఎక్కడా సహాయం అందడం లేదు. వ్యవసాయమే తప్ప ఇతర పని చేయలేని కౌలు రైతులు ఏడాదంతా కష్టపడి పండించిన పంట తీసుకున్న అప్పులు, వాటి వడ్డీకే సరిపోతోంది. కౌలు డబ్బులు కాకుండా రైతు కుటుంబ సభ్యుల కష్టం పోనూ ఎరువులు, విత్తనాలకు అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో అయినా కౌలు రైతులను గుర్తించి అర్హత కార్డులు ఇచ్చి ప్రభుత్వం బ్యాంకు రుణాలు అందించేలా చూడాలని కౌలు రైతులు కోరుతున్నారు. అమ్ముకోవడానికి సైతం తిప్పలుకౌలు రైతులకు పంట అమ్ముకోవడానికీ



తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వం ప్రతీ సీజన్‌లో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు సాగు చేస్తున్నారు. అనే వివరాలను వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. అధికారులు సైతం పట్టా పాసు పుస్తకం ఉన్న రైతుల వివరాలను మాత్రమే ఆన్‌లైన్ చేస్తున్నారు. తమకు రైతుబంధు సాయం ఎక్కడరాదో అన్న భయంతో పంట సాగు చేయకుండా పట్టా పాసుపుస్తకం ఉన్న భూ యజమానులు సైతం కౌలు రైతు పంటను తమపేరున నమోదు చేసుకుంటున్నారు. వివరాలు అన్ని భూ యజమాని పేరిట ఉండడంతో కౌలు రైతు పండించిన పంట విక్రయించే సమయానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కౌలు రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలు, సీసీఐ కేంద్రాల వద్ద విక్రయించేటప్పుడు భూయజమాని వివరాలు ముందస్తుగా ఉండడంతో వారి ఖాతాల్లో పంట విక్రయానికి సంబంధించి సొమ్ము జమ అవుతోంది. తిరిగి వారి ఖాతాల్లో నుంచి తీసుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం జరిగినా పరిహారం సైతం కౌలుకు ఇచ్చిన భూ యజమానికే వర్తిస్తుందని కౌలు రైతులు చెబుతున్నారు.

## రేషన్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దు




మొదటి పేజీ తరువాయి

సూచించారు. అనుభవజ్ఞులైన స్పెషాలిటీ డాక్టర్లను ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి వైద్య సేవలకు వినియోగించుకోవాలని, మిగతా డాక్టర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు.

**కలెక్టర్లతో సమీక్ష**

ప్రజాహితమే ధ్యేయంగా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకుంటూ, అభివృద్ధి–సంక్షేమాలను సమపాళ్లలో కొనసాగిస్తూ ఇది ప్రజాప్రభుత్వం అనే మార్కు ఉండేలా పరిపాలన నిర్వహించాలని జిల్లాల కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజా సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడంలో కలెక్టర్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రజాపాలన సహా ఇతర రూపాల్లో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తుల్లో నిజమైన లబ్దిదారులను గుర్తించి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లపైనే ఉందని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణ పునర్నిర్మాణం కలెక్టర్ల బాధ్యత**

తెలంగాణ పునర్నిర్మాణాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందని సీఎం అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం విద్యావ్యవస్థ అత్యంత కీలకమైనదని, విద్యా వ్యవస్థ దెబ్బతినకుండా చూసుకోవాలని కలెక్టర్లకు చెప్పారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే విద్యార్థులు సొంత కుటుంబ సభ్యుల్లా స్పందించే తీరుగా కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితనం ఉండాలని, ఒక శంకరన్, ఒక శ్రీధరన్ లాంటి అధికారులు చూపిన ఆదర్శాలను పాటించాలని సీఎం కలెక్టర్లకు సూచించారు. ప్రజాపాలన, ధరణి సమస్యలు, ఖరీఫ్ వ్యవసాయం, ప్రజారోగ్యం – సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళాశక్తి, విద్య, శాంతి భద్రతలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల వంటి అనేక అంశాలపై సీఎం అధికారులతో చర్చిస్తున్నారు. కలెక్టర్ల సదస్సులో ధరణి సమస్యల పరిష్కారం వివరాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునేందుకు జియో ట్యాగింగ్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజలకు లబ్ది చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సీఎం సూచించారు.

**ఆగస్టు 15లోగా ధరణి దరఖాస్తుల పరిష్కరించాలి.**

పెండింగ్ లో ఉన్న ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి మార్చి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇప్పటికే ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించిందని, కొత్తగా 1,15,308 దరఖాస్తు చేసుకున్నారని అధికారులు వివరించారు. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అధికారులు తిరస్కరణకు కారణాన్నికూడా తప్పకుండా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఆగస్టు 15లోగా పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని గడువు నిర్ణయించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం ప్రకటించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మందిని సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీరిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని సీఎం ప్రకటించారు. అయిదేండ్లలో రూ. లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు, చేపట్టే వ్యాపారాలకు తమ వినూత్న ఆలోచనలు కూడా జోడించాలని కలెక్టర్లకు సూచించారు. ఆర్టీసీలో కొత్తగా అవసరమయ్యే అద్దె బస్సులు కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని చెప్పారు.

## వివాదంగా మారుతోంన్న మూసీ సుందరీకరణ

మొదటి పేజీ తరువాయి

భాగంగా గత కొన్ని రోజులుగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) సంబంధిత ప్రక్రియను స్పీడప్ చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో నదిని అనుసరించి 50 మీటర్ల పరిధిలో బఫర్ జోన్ గా గుర్తించి ప్రైవేట్ ఆస్తుల వివరాల సేకరణ పనులను మొదలు పెట్టింది. మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్ట్ మొదటి దశలో ఉస్మాన్ సాగర్ డ్యామ్ డౌన్ స్ట్రీమ్ పాయింట్ నండి గౌరెల్లి సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు, హిమాయత్ సాగర్ డ్యామ్ డౌన్ స్ట్రీమ్ పాయింట్ నుండి బాపూఘాట్ వరకు విస్తరణ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నది చుట్టూ ఉన్న వారసత్వ కట్టడాల పరిరక్షణ, పునరుద్ధరణ చేయడంతో పాటు ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా చూడాలని ప్రభుత్వం ముందుగానే అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ వారికి ప్రజల నుండి తీవ్ర స్థాయిలో ప్రతిఘటన ఎదురవుతుండగా వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

**బీఆర్ఎస్ హయాంలోనే**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మూసీ సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆస్తులు కోల్పోయే పేదవారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు ఏడు వేల డబుల్ బెడ్ ఇండ్లను పంపిణీ చేయకుండా ఆపి ఉంచారు. ఇంతలో ఎన్నికలు రావడం, బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఈ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సీఎంగా ఏర్పడిన కొత్త ప్రభుత్వం కూడా మూసీ బ్యూటిఫికేషన్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు రాబోయే మూడేళ్లలో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆస్తుల వివరాలు సేకరించాలని ఆదేశించింది. అయితే ఫీల్డ్ విజిట్ చేస్తున్న అధికారులకు ప్రజల నుంచి ప్రతిఘటనలు ఎదురౌతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధికారులతో ఘర్షణలకు దిగుతున్నారు.

**క్లిష్టంగా మారుతున్న ప్రైవేట్ ఆస్తుల సేకరణ?**

జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 55 కిలోమీటర్ల మేర పారుతున్న మూసీ నది పరివాహక ప్రాంతాలను జోన్ల వారీగా విభజించి వాణిజ్య కార్యకలాపాలను అనుమతించడం ద్వారా నిధుల సేకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అనుగుణంగా మూసీ వెంట రవాణా కారిడార్లు, లాజిస్టిక్ హబ్ లను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే బ్యూటిఫికేషన్ లో భాగంగా సేకరిస్తున్న ఆస్తులలో చాలా వరకు ప్రైవేటు వ్యక్తులకు చెందినవి ఉన్నాయి. వీటిల్లో బహుళ అంతస్థుల అపార్ట్ మెంట్లు ,భవనాలు, ఇతర కట్టడాలు ఉన్నాయి. అయితే వీటిని ఖాళీ చేయించడం తల నొప్పిని తెప్పిస్తోంది. ఆస్తుల సేకరణ వివరాల కోసం వస్తున్న అధికారులకు స్థానికుల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. ఇలా మూసీ వెంట సుమారు 10 వేలకు పైగా కట్టడాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించగా వారి నుంచి ఆస్తుల సేకరణకు మార్గాలకు అన్వేషిస్తోంది. భూసేకరణ చట్టం కింద ఇలాంటి వారికి పరిహారం చెల్లించడంతో పాటు ఇతర మార్గాలను వెతుకుతోంది. ఇంతవరకు భాగానే ఉన్నప్పటికీ ప్రజలు మాత్రం తమ ఆస్తులను అప్పగించేందుకు ముందుకు రాకపోగా ఆందోళనలకు దారితీస్తోంది. ప్రజలు ప్రాంతాల వారీగా ఏకమై కార్యాచరణ రూపొందించేందుకు సమాయత్తం అవుతున్నారు.

**బీఆర్ఎస్ సంఘీభావం**

గతంలో అధికారంలో ఉన్న సమయంలో మూసీ వెంట ఉన్న ఆస్తుల సేకరణకు నిర్ణయం తీసుకున్న బీఆర్ఎస్ ఇప్పుడు మాట మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ బ్యూటిఫికేషన్ పేరుతో పేదల ఆస్తులను కొల్లగొట్టేందుకు చూస్తోందని ఆరోపిస్తూ వారితో కలిసి ఆందోళనలకు తెరతీసింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఇటీవల కొంతమంది మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలతో కలిసి ఆందోళన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇలా ఎక్కడిక్కడ ఆందోళనలు మొదలు కావడంతో మూసీ వెంట ఉన్న ఆస్తుల సేకరణ అంత సులువు కాదనే అభిప్రాయాలు అంతటా వ్యక్తమవుతున్నాయి .

## పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ బదులిచ్చారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక ఇద్దరు ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో ఉన్న డీఎస్పీలు ఫోన్ చేసి పార్టీ మారండి. లేదంటే ప్రాణగండం ఉందని బెదిరించారు, ఇంకా కొందరిని బెదిరింపులకు గురి చేస్తున్నారు, బీజేపీని వాషింగ్ మిషన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ అదే పనిని తెలంగాణలో చేస్తోందన్నారు కేటీర్. వేరే రాష్ట్రాల్లో బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుంటే మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అంటున్నారు. కానీ మీరు చేస్తున్నది ఏంటని అడిగితే సమాధానం లేదు. కానీ సేమ్ అదే పని తెలంగాణలలో చేస్తున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి సొంత ఆస్తులను ధ్వసం చేస్తున్నారు. విజిలెన్స్ దాడులతో బెదిరిస్తున్నారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. బడే భాయ్ %–% చోటే భాయ్‌కి తేడా ఏం లేదు. ఢిల్లీలో బడే భాయ్ నరేంద్ర మోడీ రాజ్యాంగబద్ధ సంస్థలను ఉపయోగించుకున్నట్లుగానే ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ విభాగాలను ఉపయోగించుకుని మా ఎమ్మెల్యేలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద మాకు సానుభూతి ఉంది. ఎందుకంటే వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారు. వారిని ఎవరూ కాపాడలేరు. ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు. రాజకీయాల్లో హత్యలు ఉండవు. ఆత్మహత్యలే ఉంటాయనడానికి ఇదే ఉదాహరణ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రుణమాఫీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఈటెల

మొదటి పేజీ తరువాయి

మీడియాతో మాట్లాడిన ఆయన వ్యక్తిగతంగా వివిధ కారణాలతో అనేక మంది రైతులు తమ రుణాలను రీ షెడ్యూల్ చేసుకున్నారని, ఐటీ రిటర్న్ ఫైల్ చేసుకున్నారని వారందరికీ ఇప్పుడు రుణమాఫీ చేయబోమని షరతు విధించడం సరికాదన్నారు. అధికారం ఇచ్చారు కాబట్టి ఐదేళ్లు ఏదైనా చేయవచ్చు అనే అహంకారం రేవంత్ రెడ్డి సర్కార్ లో కనిపిస్తున్నదని మోసం చేసేవాళ్లకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రుణమాఫీకి తెల్ల రేషన్ కార్డు ప్రామాణికం అంటున్నారు.. 3.5 ఎకరాల తరి పొలం, 7 ఎకరాల మెట్ట పొలం ఉన్న వారికి రేషన్ కార్డు ఇవ్వరు. ఈ విషయం తెలియదా? రేవంత్ రెడ్డి చదువుకున్నారా? అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డు ఇవ్వక పదేళ్లు అవుతున్నది. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా రేషన్ కార్డులు ఇవ్వకుండా ఇప్పుడు రుణమాఫీకి తెల్లరేషన్ కార్డుకు లింకు పెట్టడం ఏంటని నిలదీశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కాకముందే ఏడు రకాల అవతారాలెత్తుతున్నారని రైతుల శాపనార్థాలు ఈ ప్రభుత్వానికి తగులుతాయన్నారు. విశ్వసనీయత లేనందుకే బీఆర్ఎస్ ప్రజలు బుద్ధి చెప్పారని మోసం చేసే కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కుటుంబాల్లో విభజన జరిగినా ఒకే రేషన్ కార్డు కారణంతో వారికి రుణమాఫీ వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, ఔట్ సోర్సింగ్ లో పని చేసే వారికి, సింగరేణి కార్మికులకు రేషన్ కార్డులు లేవవి రేషన్ కార్డు నిబంధనల పేరుతో రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న 69 లక్షల మంది రైతులకు నిరాశే మిగలబోతున్నదన్నారు. ఇన్ కమ్ ట్యాక్స్ పెద్ద పెద్ద కంపెనీలే కట్టడం లేదని, ఇంటి రుణాలు, వాహన రుణాలు, పిల్లలు విదేశాలకు వెళ్లేందుకు సామాన్య ప్రజలంతా ఐటీ చెల్లిస్తున్నారని వీరిలో సింగరేణి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, అక్కడక్కడా రైతులూ చెల్లిస్తున్నారన్నారు. ఐటీ చెల్లిస్తున్నారనే పేరుతో భూమిని నమ్ముకున్న నిజమైన రైతులకు ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారని ధ్వజమెత్తారు. మా దేవత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా రుణమాఫీ చేస్తామని చెప్పారో ఆ దేవత పేరు మీద ప్రమాణం చేసి మోసం చేయడం ఏంటని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తన మాటలను నమ్మడం లేదని చివరకు దేవుళ్లపై ఒట్లు పెట్టుకుని సీఎం మోసం చేశారని ధ్వజమెత్తారు. 34 వేల కోట్ల రూపాయల రుణమాఫీని అన్ కండిషనల్ గా ఏకకాలంలో చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఈ కండీషన్లను పెట్టి అల్లికి అల్లి.. సున్నకు సున్నగా మార్చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి నీ మేనిఫెస్టో చిత్తుకాగితంతో సమానం అని, మీకు కావాల్సిందల్లా ఎమ్మెల్యేలు మాత్రమే ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ కండిషనల్ గా రైతురుణమాఫీ చేయాలని లేకుంటే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని బీజేపీ తరపున హెచ్చరిస్తున్నానన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ ను బీజేపీ ఎందుకు కూలదోస్తుందని అన్నారు. ఎవరైనా ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరాలనుకుంటే రాజీనామా చేసిన తర్వాతే చేర్చుకుంటామన్నారు. రాజ్యాంగ బద్దంగా సంక్రమించబడిన పదవుల్లో ఎవరున్నా.. నిర్దేశించిన ప్రకారం వారి ప్రోటోకాల్ అమలు చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో ప్రోటోకాల్ పాటించడం లేదన్న రేవంత్ రెడ్డి ఇవాళ ఎందుకు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రశ్నించారు. జేఎన్టీయూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ నియోజకవర్గం పరిధిలోకే వస్తుందని కానీ తనకు ఇన్విటేషన్ ఇవ్వలేదని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని చెప్పారు.

## తిహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు అనారోగ్యం

మొదటి పేజీ తరువాయి

బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 2024 మార్చి 15 ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత జ్యుడిషియల్ రిమాండ్‌లో భాగంగా ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. నాలుగు నెలలుగా ఆమె జైలులో ఉన్నారు. ఈ స్కామ్ కు సంబంధించి మొదట కవితపై ఈడీ కేసు నమోదు చేయగా తర్వాత సీబీఐ సైతం ఎంటరైంది. ఈ కేసుల్లో బెయిల్ కోసం కవిత విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. సీబీఐ కేసులో కవితపై చేపట్టిన విచారణను రౌస్ అవెన్యూ కోర్టు ఇటీవల వాయిదా వేసింది. కేసులో కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్, డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై విచారణ జూలై 22కు వాయిదా వేసింది. మద్యం కేసులో కవిత పాత్ర, ఈ నేపథ్యంలోనే సాక్ష్యాలతో కూడిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను దాఖలు చేసినట్టు సీబీఐ కోర్టుకు తెలిపింది. దానిని పరిగణనలోకి తీసుకోవాలని న్యాయ స్థానాన్ని కోరింది. ఈ అంశంపై విచారణ చేపడతామని న్యాయమూర్తి భవేజా తెలిపారు. ఈ సందర్భంగా సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులున్నాయని కవిత తరపు లాయర్ నితేష్ రానా కోర్టుకి తెలిపారు. ఛార్జిషీట్‌లో తప్పులు లేవని సీబీఐ తరపు న్యాయవాది కోర్టుకు చెప్పారు. జూలై 22కి తదుపరి విచారణను రౌస్ అవెన్యూ కోర్టు వాయిదా వేసింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# నివేదికలకే పరిమితమవుతున్న అధ్యయనాలు

నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో కొట్టుకుపోయి మొత్తం 65 మంది ప్రయాణికులు కొట్టుకుపోయిన విషాద సంఘటన తెలిసిందే. ఏటా ఈశాన్య భారతంలో కొండచరియలు విరిగిపడడం గ్రామాలు నేలమట్టమై కొన్ని వందల మంది సమాధి కావడం, రోడ్లు విధ్వంసమై ప్రజాజీవనానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడడం కొనసాగుతోంది. ఈ ముప్పు నివారణకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలో అనేక నివేదికలు సూచిస్తున్నా ఆ మేరకు ప్రభుత్వ పరంగా సరైన ప్రయత్నాలు జరగడం లేదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్‌ఐ) ఈ కొండచరియల ప్రమాదాలపై 2020లో అధ్యయనం నిర్వహించింది.దేశంలోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్ లోని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఎలాంటి ప్రణాళిక లేకుండా సాగించే కొండల క్వారీ పనులు కొండచరియలు అమాంతంగా విరిగిపడడానికి కారణమవుతున్నాయని జిఎస్‌ఐ హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి 51% అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరో ప్రాంతంగా ఈశాన్య ప్రాంతం ఉంటోంది. ఆరు నెలల పాటు ఈ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది.నేల స్వభావం పరిశీలించకుండా, పోడు వ్యవసాయం వంటివి నివారించకుండా, కొండచరియల ముప్పును తప్పించే మార్గాలు అన్వేషించకుండా ఎలాంటి అభివృద్ధి నిర్మాణాలు చేపట్టినా ప్రమాదమేనని భౌగోళిక సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటివేవీ పరిగణనలోకి తీసుకోకుండానే 2015లో లంబ్డింగ్ సిల్చార్ బ్రాడ్‌గేజ్ రైల్వే నిర్మాణాన్ని చేపట్టారని పరిశోధకులు తప్పుపట్టుతున్నారు. ఈ రైల్వే నిర్మాణంలో 2022లో 58 చోట్ల గండ్లు పడ్డాయి. జిరిబాం ఇంఫాల్ సెక్షన్‌లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను గుర్తించి వాటిని నివారించడానికి, తగిన మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి 'నేషనల్ ల్యాండ్‌స్లైడ్ ససెప్టిబిలిటీ మేపింగ్' ప్రక్రియను అమలు చేయవలసి ఉంటుందని జిఎస్‌ఐ సూచిస్తోంది.హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాల తో అత్యధిక సంఖ్యలో చెట్లు కూల్చివేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్యకాలంలో 10.76 మిలియన్ చెట్లు కూలిపోయాయి. అరుణాచల్‌లోని భారీ డిబాంగ్ డ్యామ్ నిర్మాణం కోసం 2.7 లక్షల చెట్లను కూల్చివేశారు. డెహ్రాడూన్‌లో ప్రాజెక్టుల కోసం 11,000 చెట్లను కూల్చివేయడానికి ప్రభుత్వవర్గాలు సిద్ధం కాగా సుప్రీం కోర్టు అడ్డుచక్రం వేసి ఆపగలిగింది. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. దీంతో నేల దృఢత్వం దెబ్బతిని కొండచరియలు విరిగి జారిపడుతున్నాయి. వాటికి చేరువలో నివాసాలు ఉంటే అవి నేలమట్టమవుతున్నాయి. రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా దక్షిణాఫ్రికావరకు తుపాన్లు చెలరేగడానికి హిమాలయాల పర్యావరణానికి సంబంధం ఉందని ఇండో అమెరికా మాన్సూర్ స్టడీ వెల్లడించింది. హిమానీ నదాలు దశాబ్దానికి 30నుంచి 60 మీటర్ల వంతున దాదాపు 10,000 వరకు కుదించుకుపోతున్నాయి.హిమాలయాల్లో ఎక్కువ భాగాన్ని ధ్వంసం చేసిన 2013 నాటి కేదార్‌నాథ్ విషాద సంఘటన నుంచి దేశం సరైన గుణపాఠం నేర్చుకోవడం లేదనిపిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు లబోదిబోమనడం, ఎంతమేరకు నష్టం జరిగిందో మదింపు చేయడం తప్ప ఈ వైపరీత్యాలకు మూలకారణాలేమిటో వాటిని ఎలా నివారించగలమో అన్న ముఖ్యమైన అంశాలపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించడం లేదు. ప్రకృతిపరంగా కొంత వైపరీత్యాలు జరుగుతుండగా, మానవ కల్పిత చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే ప్రకృతికి నష్టం జరుగుతోంది. అలాంటి చర్యలను ప్రభుత్వాలు అడ్డుకోవడం లేదు.ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరిగే ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆ ప్రభుత్వం తన బడ్జెట్‌లో వైపరీత్యాల నివారణకు మూడోవంతు వెచ్చిస్తోంది.అయినా ఏం లాభం? సరైన ప్రణాళికలు అమలు కావడంలేదు. ముఖ్యంగా రహదార్ల నిర్మాణాల్లో నిబంధనలు పాటించడం లేదు.వాహనాల రాకపోకలు, జనం రద్దీ, నిర్మాణాల విషయంలో సరైన అంచనా వేయాలని 2020 లోనే సుప్రీం కోర్టు నియామక కమిటీ సూచించింది. ఈమేరకు 13 హిమాలయ రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీచేసింది. పర్వత శిఖరాల్లో ఉన్న పట్టణాలు, నగరాల్లో పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో ఆయా ప్రభావాలను అంచనా వేయాలని, అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాలని కేంద్ర పర్యావరణ శాఖ కూడా ఆయా రాష్ట్రాలకు గుర్తు చేసింది. పర్వత ప్రాంతాల్లో నేల క్షీణించి కోతకు గురవడం, జోషిమఠ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో విపరీత పరిణామాలు సంభవించడం చర్చనీయాంశం అవుతున్నాయి. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై చర్చలు కూడా జరుగుతున్నాయి. హిమాలయ రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం క్లిష్టమైన సమస్య. అందుకనే ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి నిర్మాణాలు చేపట్టడం అవసరం. పర్యావరణ రంగాన్ని ఇతోధికంగా ప్రోత్సహించాలన్న ఆలోచనతో రవాణా సామర్థ్యాన్ని మితిమీరి పెంచడం మంచిది కాదని పర్యావరణ నిపుణులు గత కొన్నేళ్లుగా హెచ్చరిస్తున్నారు. అయినా నిబంధనలను త్రోసిరాజని రెండు వరసల రోడ్ల డిజైన్ ప్రకారం కొండల్లో రోడ్లను విస్తరించడం ప్రమాదాలకు దారి తీస్తోంది.

# దేవుడా కరుణించు మార్కెట్ ఆస్తులను కాపాడుకో..!

**రక్షించవలసిన వారే.. భూమిని భుజిస్తే..?**
**అధికార యంత్రాంగం నిద్రలో ఉన్నారా..?**
**చేతులెత్తేశారా..?**

### మార్కెట్ ఆస్తుల రక్షణకు స్థానిక ప్రజల డిమాండ్




మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జులై 16 (తీన్మార్ న్యూస్): వ్యవసాయం మార్కెట్ భూములు కబ్జా చేసుకోవడం తక్షణమే నిలిపి వేసి,వాటిని భావితరాల కోసం ప్రజా అవసరాలకు వినియోగించు కోవాలని స్థానిక మండల ప్రజలు కోరుతున్నారు. వనపర్తి జిల్లా మదనా పురం మండలం కేంద్రంలోని నడి బొడ్డున ఉన్న 353 ఎకరాల భూమిలో 150 ఎకరాల వ్యవసాయ మార్కెట్? భూములను అమ్మకా నికి పెట్టడం దారుణమని,ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే ఇలా భూములను అమ్ముకుంటూ పోతే ఎట్లా తక్షణమే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులు అమ్మకం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మండలం ప్రజలు డిమాండ్. విలువైన భూములు అమ్ముకుంటూ పోతే రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంద న్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని,సొంత ఆస్తి కంటే మిన్నగా మార్కెట్ భూములను కాపాడుతూ ఉండాలని ఆరోపించారు. కానీ అందుకు విరుద్ధంగా కళ్లెదుటే కోట్ల రూపాయల స్థలాలు అన్యాక్రాంతమ వుతున్నా పట్టించుకోవడంలేదని మండలం ప్రజలుఅంటున్నారు. మండలంలోని విలువైన స్థలాలు కబ్జాలకు ఆక్రమణకు గురయ్యాయి గురవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం వాటి విలువ కోట్ల రూపాయలు పలుకుతున్నాయని ఆరోపణలు. యథేచ్ఛగా వాటిని ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసుకుని అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్నారని మండలం ప్రజలు కోరుతున్నారు.

# చినుకు పడితే చిత్తడి చిత్తడే

### – గుంతల మాయంగా వర్షపు నీటితో రహదారులు



ఆత్మకూర్, జులై 16(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో చినుకు పడితే చిత్తడి చిత్తడిగా రహదారులు ఉన్నాయి. మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన రోడ్లపై ఎక్కడికక్కడే వర్షపు నీరు నిల్వ ఆగి ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందర, స్థానిక గాంధీ చౌరస్తాలో, నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో రోడ్డుపై వర్షపు నీరు ఒక మడుగు రూపంలో నిల్వ ఉన్నాయి. ఎన్నిసార్లు మున్సిపల్ కమిషనర్ కి, మున్సిపల్ చైర్మన్కు విన్నపించిన ఫలితం లేదని పట్టణ ప్రజలు వాపోయారు. మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి మున్సిపల్ పరిధిలో గుంతల రహదారిలో మొరం మట్టి వేసి గుంతలు పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రయాణికులు పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# కొరియోగ్రాఫర్ రాకేష్ కుటుంబానికి చేయూత



పరకాల, జులై 16 (తీన్మార్ న్యూస్): డ్యాన్స్ కొరియోగ్రాఫర్ గూడెల్లి రవిరాకేష్ (జస్టిన్ కిస్సీ) కుటుంబానికి కౌన్సిలర్ పూర్ణచారి చేయూతనందించారు. పరకాల పట్టణంలోని మాదారం కాలనీకి చెందిన రవిరాకేష్ హైదరాబాద్లో కొరియోగ్రాఫర్గా చేస్తూ ఈ నెల 12న గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తొమ్మిదోవార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి మృతుడి కుటుంబానికి తనవంతుసాయంగా 25కిలోల బియ్యంతోపాటు కిరాణాసామాగ్రిని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకునేందుకు పెద్దమనసుతో ముందుకువచ్చిన కౌన్సిలర్ను పలువురు కాలనీవాసులు అభినందించారు. ఈ సందర్ంగా పూర్ణచారి మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబానికి చేయూతనివ్వడం తనకు సంతోషకరంగా ఉంటుందన్నారు. పేదరికంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి డ్యాన్స్ కొరియోగ్రాఫర్గా మంచి పేరుతెచ్చుకునే క్రమంలో రవిరాకేష్ గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుడి చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పసుల ప్రశాంత్,బుస్స.శివ శంకర్,చెరుకు వేణు,మంద టునీట్,కన్నం సుధాకర్, మంద టునిట్, సూదమల్ల శ్రీనివాస్, గూడెల్లి వెంకటేష్, రాజు,సుదర్శన్ , కార్తీక్ , అర్జున్, శివ, విక్రమ్, రంజిత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ భూముల్లో అక్రమాల తొలగింపు

### రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి



జవహర్ నగర్, జులై 16(తీన్మార్ న్యూస్): ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గుడిసెలు వేస్తూ అక్రమించాలని చూస్తున్న కట్టడాలను కూల్చివేస్తూ సర్కారు భూములకు రక్షణ కల్పిస్తున్నామని రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. జవహర్నగర్ కార్పొరేషన్లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ చిన్నపాటి గుడిసెలు, కర్రలను పెడుతూ సర్కారు భూములను కాజేయాలని అక్రమార్కులు చూస్తున్నారని, ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నిమ్మగడ్డ సుబ్బారావుకు నివాళులర్పించిన చల్లా ధర్మారెడ్డి



వరంగల్, జులై 16 (తీన్మార్ న్యూస్): బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు తండ్రి నిమ్మగడ్డ సుబ్బారావు మంగళవారం సాయంత్రం మృతిచెందడం జరిగింది. విషయం తెలిసిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సుబ్బారావు పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో నియోజకవర్గంలోని పలు మండలాలకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# డ్రైనేజికోసం రాస్తారోకో

భద్రాద్రి కొత్తగూడెం: డ్రైనేజీని తక్షణమే నిర్మించాలని ని డిమాండ్ చేస్తూ చంద్రుగొండ గ్రామస్తులు చంద్రుగొండ జూలూరుపాడు ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకోటి చేపట్టారు.. వర్షం వస్తే డ్రైనేజీ లేకపోవడంతో వర్షపు నీరంతా తమ ఇళ్ళలోకే చేరుతుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.. ఎట్టకేలకు ప్రభుత్వం నుండి సుమారు మూడు కోట్లకు పైగా నిధులు డ్రైనేజీ నిర్మాణం కోసం మంజూరయ్యాయని, మరి కొన్ని రోజుల్లో పనులు ప్రారంభించాల్సిన సమయంలో డ్రైనేజీ నిర్మాణం చేపడితే తమ ఇళ్ల కోల్పోవాల్సి వస్తుందని కొందరు వ్యక్తులు డ్రైనేజీ నిర్మాణ పనులను అడ్డుకోవడంతో డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం చోటు చేస్తుందని, తమ స్వార్థం కోసం కొంతమంది వ్యక్తులు డ్రైనేజీ నిర్మాణ పనులు అడ్డుకుంటున్నారని దీనితో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక రాస్తారోకో చేపట్టామన్నారు.

# ప్రత్యేక ప్రార్థనలతో పీర్లను ఊరేగించిన ముజావర్ షేక్ నబి



పాలకవీడు, జూలై 16 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలంలోని కొత్త తండా గ్రామంలో పీర్ల చావిడి వద్ద మంగళవారం పదవ షరగత్ లో భాగంగా పీర్ల ముజావర్ షేక్ నబి ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా పడి పంటలు మెండుగా పండాలని పీర్ల వద్ద ప్రత్యేక దువా చేసి పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు పీర్లకు నీలారబోస్తూ, పీర్లకు గంధం దట్టిలు, కొబ్బరి కుడకలు, బెల్లం, సాంబ్రాణి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తుల్ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హనుమ, భీముడు, దసురు, సాయి, సూక్య, హుస్సేను, రంగా, సిద్దు, రామారావు, నాగరాజు, ముని, రవి, లక్ష్మ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


# వంటగ్యాస్ వాడకంపై అవగాహన



### – సన్ సహి హెచ్పీ గ్యాస్ ఏజెన్సీ

అమరచింత, జులై 16(తీన్మార్ న్యూస్): అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా సన్ సహి ఆత్మకూర్ హెచ్పి గ్యాస్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు హెచ్పీ గ్యాస్ వారి సెలబ్రేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వంట గ్యాస్ ఏ విధంగా ఉపయోగించుకోవాలి ప్రధానమంత్రి ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఏ విధంగా పొందాలి గ్యాస్ ని ఎలా ఆదా చేసుకోవాలి, వంట గ్యాస్ ఎలా బుక్ చేసుకోవాలని, వాళ్ళ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్.పీ గ్యాస్ మేనేజర్ ఆనంద్ కుమార్, హెచ్.పీ గ్యాస్ స్టాఫ్ హర్షద్, హెచ్పీ గ్యాస్ సిబ్బంది బాలరాజ్, ఇస్సాక్,సునీల్, వేణు, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# పీర్లను దర్శించుకున్న మున్సిపల్ చైర్ పర్సన్



అమర చింత, జులై 16(తీన్మార్ న్యూస్): అమరచింత మున్సిపాలిటీ పరిధిలో మొహరం పండుగ పురస్కరించుకొని స్థానిక రాజావలి దర్గా లో పెద్ద పీర్లు కొలువైనాయి. ఈ సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ పెద్ద పీర్లను దర్శించుకుని పెద్ద పీర్లకు దట్టీలు పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ మొక్కును తీర్చుకున్నారు.

# నేడు శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు



ఆత్మకూర్, జులై 16(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామంలో స్థానిక శ్రీశ్రీశ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రోజు తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఉదయం ఆరు గంటల నుంచి పంచామృతం అభిషేకం విశేష దర్శనం వంటి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆలయ పూజారి శ్రీధర్ జోషి ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తొలి ఏకాదశి పర్వదినాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# పల్లె పల్లెకు పల్లె వెలుగులు

**- ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు**

**- 35 కొత్త బస్సుల మంజూరుకి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదనలు అందించిన ఎమ్మెల్యే**

**- సానుకూలంగా స్పందించిన మంత్రి**

**- తీరనున్న పల్లె ప్రజల రవాణా కష్టాలు**



వనపర్తి ప్రతినిధి, జూలై 16(తీన్మార్ న్యూస్): ఎట్టకేలకు వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పల్లె ప్రజల రవాణా కష్టాలు తీరనున్నాయి. పల్లె ప్రజల రవాణా కష్టాలను, విద్యార్థుల ఇబ్బందులను, మహిళల అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకున్న ఎమ్మెల్యే వనపర్తి నియోజకవర్గం లోని ప్రతి గ్రామానికి ఆర్టిసి బస్సును నడపాలన్న సంకల్పంతో ఆర్టీసీ బస్సులు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. వనపర్తి జిల్లా, కేంద్రంలో సిటీ బస్ ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నర్సింగయ్య పల్లి వరకు, రాజనగరం నుంచి వనపర్తి బస్టాండ్, రాజపేట నాగవరం అంబేద్కర్ చౌరస్తా (పానుగల్ చౌరస్తా) మెట్టుపల్లి, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి దత్తాయిపల్లి చందాపూర్, కందిరీగ తండా, నాగమ్మ తండా కాశీంనగర్, జయన్న తిరుమలాపూర్, మున్ననూర్, అప్పయ్ పల్లి గుంత తండా కీరియతాండ వనపర్తి, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి పెద్దగూడెం కడుకుంట్ల మెంటేపల్లి వనపర్తి, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి పెద్దమందడి, జగత్పల్లి మణిగిల్ల, పెద్దమందడి అల్వాల మంగంపల్లి సోలిపురం, చిన్న మందడి ముందర తండా పామిరెడ్డిపల్లి బలిజపల్లి అంకుర్ వెంకటాపురం చిట్యాల వనపర్తి, కొత్తకోట చిలకటోన్ పల్లి,కన్మనూర్, బలిదుపల్లి, వెల్టూర్, గట్ల ఖానాపురం, మంగంపల్లి, అమ్మపల్లి, మద్దిగట్ల మోజర్ల, కొత్తకోట ఖిల్లా గణపురం మండల కేంద్రం నుంచి మల్కాపురం, మానాజీపేట, ఉప్పరపల్లి, డికె.తాండ, షాపూర్, ఘనపురం, పర్వతాపూర్, కమలుద్దిన్పూర్, వెంకటాంపల్లి, తిరుమలయ్య పల్లి, అల్లమాయపల్లి, మల్కు మియాన్ పల్లి, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, వెనికి తాండ, సల్కెలాపూర్, వెల్కిచర్ల గ్రామాలకు, గోపాల్పేట మండల కేంద్రం నుంచి గోపాల్పేట పోలికే పహాడ్ తూడుకుర్తి తలుపునూర్ రేవల్లి కేశంపేట, తండా, పాత తాండ కొత్త తండా చాకలి పల్లి ఏదుట్ల గోపాల్పేట గ్రామాలకు, గోపాల్పేట మండల కేంద్రం నుంచి గోపాల్పేట ఏదుట్ల కేశంపేట చెన్నారం గొల్లపల్లి చీర్కపల్లి గాంధీనగర్ ఏదుల అనంతపూర్ గోపాల్పేట, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి అప్పయ్యపల్లి మున్ననూరు జయన్న తిరుమలాపూర్ రేమద్దుల కు షటిల్ బస్ ఏర్పాటు పెబ్బేర్ మండల కేంద్రం నుంచి తోమాలపల్లి శాఖాపూర్ రామమ్మపేట రాంపురం పెబ్బేరు, పెబ్బేరు మండల కేంద్రం నుంచి కంచిరావుపల్లి, తండా, కంబల్లాపురం శ్రీరంగా పురం, పెబ్బేరు, పెబ్బేరు మండల కేంద్రం నుంచి రంగాపురం జనంపల్లి మున గమాను దిన్నె పెంచికలపాడు ఈర్లదిన్నె బూడిదపాడు పాత సుగురు కొత్త సుగురు భూనాదిపురం రంగాపురం పెబ్బేరు, పెబ్బేరు మండల కేంద్రం నుంచి కిష్టారెడ్డిపేట ( చెలిమిళ్ళ) వెంకటాపురం పాత పల్లి అయ్యవారిపల్లి గుమ్మడం, తాండ, యాపర్ల, పెబ్బేర్ వనపర్తి జిల్లా కేంద్రం నుంచి నాగర్ కర్నూల్ వయా చాకల్ పల్లి, వనపర్తి నియోజక వర్గ ప్రజల అవసరార్థం వివిధ పుణ్యక్షేత్రాల సందర్శనార్థమై, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి యాదగిరిగుట్ట భద్రాచలం వేములవాడ తిరుపతి శ్రీశైలం మంత్రాలయం, పుట్టపర్తి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు, వనపర్తి జిల్లా కేంద్రం నుంచి కర్నూల్, బెంగళూరు, విజయవాడ నెల్లూరు చెన్నై పూణే ముంబై ప్రధాన నగరాలకు రవాణా సౌకర్యం కోసం బస్సులను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బస్సులు నడవాలన్నా సంకల్పంతో ప్రత్యేకమైన రోడ్లను రూపొందించి ఆ రూట్లల్లో బస్సులు నడిపేందుకు కొత్త బస్సులను మంజూరు చేయాలని కోరుతూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ను కలిసి ప్రతిపాదనలు అందజేయడం నియోజకవర్గ ప్రజల ఇబ్బందుల పరిష్కారంపై ఆయనకున్న నిబద్ధతను చాటుకున్నారు.

## మాదక ద్రవ్యాలపై విద్యార్థులతో ఎక్సైజ్ అధికారుల అవగాహన సదస్సు





**కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ**

పరకాల, జులై 16 (తీన్మార్ న్యూస్): మంగళవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎస్వి డీగ్రీ కళాశాలలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల, అనర్దాలపై అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల పలు సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ, ఎస్ఐ వై. జ్యోతి, ఎస్ఐ డి. సులోచన, శ్రీనివాస చారి, ప్రిన్సిపాల్ (ఎస్వి డీగ్రీ కాలేజీ ) మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హత కలిగిన అంగన్వాడి హెల్పర్లకు టీచర్లుగా ప్రమోషన్ ఇవ్వాలి

**- సిఐటియు**

నల్లగొండ జిల్లా ప్రతినిధి, జూలై 16(తీన్మార్ న్యూస్): అర్హత కలిగిన అంగన్వాడి హెల్పర్లకు టీచరుగా పదోన్నతి కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె విజయలక్ష్మి కోరారు. మంగళవారం తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి (మహిళా శిశు సంక్షేమ శాఖ) సక్కుబాయి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉండి అంగన్వాడీ హెల్పర్ గా పనిచేస్తూ అనుభవం కలిగిన వారికి పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. 60 సంవత్సరాల వయసు కారణంగా రిటైర్మెంట్ అవుతున్నవారు. సూపర్వైజర్ గా పదోన్నతి పొందిన వారి స్థానాలలో హెల్పర్లకు



పదోన్నతులు కల్పించిన తరువాత ఖాళీ పోస్టులు చూపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ నలగొండ ప్రాజెక్టు అధ్యక్షురాలు పి.సరిత, యూనియన్ నాయకులు పి.అనిత, ఏ.ఇందిరా, టి.లక్ష్మి, బి.నళిని, జి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ పనులను పర్యవేక్షించిన మర్రి నిరంజన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 16(తీన్మార్ న్యూస్): ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగల్ పల్లి పటేల్ గూడా లో 15 ఫైనాన్స్ నిధుల నుండి 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ పనులను మంగళవారం రోజు ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగామర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను పర్యవేక్షించి నాణ్యత పాటించాలన్నారు. పటేల్ గూడా లో తీవ్ర నీటి సమస్య ఉన్నందున రెండు రోజుల క్రితం బోర్లను వేయించి వచ్చిన వాటర్ తో తాత్కాలికంగా నీటి సమస్యను పరిష్కరించామన్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తయిన వెంటనే మిషన్ భగీరథ నుండి పైప్లైన్ ద్వారా వాటర్ ట్యాంక్ కు అందించి అక్కడినుండి గ్రామంలోని ప్రతి ఇంటికి దసరా పండుగ లోపు సరఫరా చేస్తామన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వైస్ చైర్మన్ కామండ్ల యాదగిరి, 12వ వార్డు కౌన్సిలర్ నారాని మౌనిక సుధాకర్ గౌడ్, కమిషనర్ బాలకృష్ణ, డిఈ వెంకన్న,



ఏఈ వీరాంజనేయులు, నాయకులు ఉదయపాల్ రెడ్డి ,పాశం సురేందర్ గౌడ్, శ్రీనివాస్, జంగయ్య, శ్రీశైలం, కొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ పై ప్రభుత్వ కొర్రీలు ఎందుకు..?

**రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ అనడంలో అర్థమేంటి..?**



పాలకవీడు, జులై 16 (తీన్మార్ న్యూస్): రుణమాఫీ కోసం ప్రభుత్వం పెట్టిన కొర్రీలు చూస్తుంటే ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించుకునే ప్రయత్నంలో భాగమేనని సిపిఎం మండల కార్యదర్శి కంగగట్ల అనంత ప్రకాష్ అన్నారు మంగళవారం ఆయన పాలకవీడు మండల కేంద్రంలో మాట్లాడుతూ రేషన్ కార్డులు పాస్ పుస్తకాలు లేని రైతులు లక్షల్లో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి సమస్యల వల్ల చాలామందికి పాస్ పుస్తకాలు రాలేదని రేషన్ కార్డు పాస్ పుస్తకాలు ఉంటేనే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకు కూడా రుణమాఫీ ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా 2 లక్షల పైబడి రుణమున రైతులకు మొత్తం చెల్లించిన తర్వాతే రుణమాఫీ చేస్తాననడం సరికాదని కటాఫ్ తేదీ మధ్యలో ఉన్న రుణాలన్నీ మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# దోరేపల్లి గ్రామవాసికి రసాయన శాస్త్రంలో డాక్టరేట్

నల్లగొండ జిల్లా ప్రతినిధి, జూలై 16(తీన్మార్ న్యూస్): జిల్లాలోని దోరేపల్లి గ్రామవాసి ఎండి.ఖదీర్ కు రసాయన శాస్త్రంలో ఎం జి యు నుండి డాక్టరేట్ ను ఎంజియూ రసాయన శాస్త్ర ఆధ్యాపకులు దోమల రమేష్ పర్యవేక్షణలో సింథసిస్ క్యారెక్టర్జేషన్ బయోలాజికల్ యాక్టివిటీ అండ్ డాకింగ్ స్టడీస్, ఆఫ్ న్యూ 1, 3, 4 ఆక్సా డయాజోల్-2 అమీన్ ఆఫ్ 1,8 నాప్తెరిడి 3 ఫినాక్సి ఫినైల్ , టాలిల్ అండ్ స్కిఫ్ బేస్ డెరివేటివ్స్" అంశంపై పరిశోధన చేసి తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తన పరిశోధన ఫలితాలను వివరిస్తూ ఈ ఉత్పన్నాలను యాంటీ క్యాన్సర్ యాంటీ ఫంగల్ మరియు ఆంటీ బ్యాక్టీరియల్ గా ఉపయోగించవచ్చాన్నారు. ఖదీర్ ప్రస్తుతం హైదరాబాదులోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీనియర్ ఆధ్యాపకులుగా సేవలందిస్తున్నారు. సామాన్య కుటుంబం నేపథ్యం నుండి వచ్చిన ఖదీర్ అంచలంచలుగా ఎదుగుతూ డాక్టరేట్ పట్టా అందుకోవడం గ్రామీణ పేదలకు స్ఫూర్తిదాయకం అని డా దోమల రమేష్ అన్నారు. తనకు పరిశోధన క్రమంలో సహకరించిన



గురువులకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

# పెబ్బేరులో ప్లాట్ల బాధితుల ఆందోళన

**తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు**

పెబ్బేరు, జూలై 16 (తీన్మార్ న్యూస్): ఎలాంటి విచారణ జరపకుండా హైదరాబాద్ వాసులకు అదికారులు మా భూములు అప్ప జెప్పడంపై పెబ్బేరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్ర నిరసన తెలుపుతూ, ఇంప్లిమెంటేషన్ ఆపాలని కోరుతూ, మాకు అన్యాయం జరగకుండా మా ప్లాట్ లు మరియు భూములు మాకే దక్కాలని తహసిల్దార్ లక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. పెబ్బేరు మునిసిపాలిటీ పరిధిలోని 458 సర్వే నెంబర్ లో గత 15 సంవత్సరాల క్రితం కొందరు వ్యాపారులు ప్లాట్ లు వేశారు. అందులో పెబ్బేరు స్థానికులు సుమారుగా కనకదుర్గ వెంచర్, శ్రీనివాస వెంచర్ లలో 450 మంది ప్లాట్ల యజమానులు ఉన్నారు.కానీ హైద్రాబాద్ కు చెందిన ముగ్గురు ముస్లిం కబ్జాదారులు ఈ 458 నెంబర్ తో పాటు ఇదే రెవెన్యూ పరిధిలో 545,555 సర్వే నెంబర్ లను కలుపుకొని మొత్తం 13 ఎకరాల 39 గుంటలు మాఫీ ఇనాం అని వనపర్తి ఆర్డిఓకి అప్పీల్ వేశారు.ఇట్టి విషయంలో వనపర్తి ఆర్డీఓ చుట్టూ ప్రక్కల రైతులతో గాని, ప్లాట్ యజమానులతో గాని సమగ్ర విచారణ



చేయకుండా తూతూ మంత్రంగా హియరింగ్ జరిపి హైదరాబాద్ వాసులకు ఇట్టి భూమి చెందేవిదంగా ఆక్యూపేన్సీ రైట్ సర్టిఫికెట్ ఇంప్లిమెంటేషన్ కొరకు స్థానిక తహసిల్దార్ కు పంపించారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు,రైతులు విచారణ జరపకుండా వేరే వారికి మా భూములు అప్ప జెప్పడంపై తీవ్ర నిరసన తెలుపుతూ, ఇంప్లిమెంటేషన్ ఆపాలని కోరుతూ, మాకు అన్యాయం జరగకుండా మా ప్లాట్ లు మరియు భూములు మాకే దక్కాలని సుమారు 50 మంది పెబ్బేరు తహసిల్దార్కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.కిరణ్ కుమార్ గౌడ్, పరుశరాముడు, మైబు, శివారెడ్డి, ఎల్లస్వామి, వెంకటేష్, నాగేశ్వర్ రెడ్డి, నిజాముద్దీన్, సర్వేష్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# బొత్తలపాలెంలో అమ్మ మాట - అంగన్వాడి బడిబాట

**అంగన్వాడి కేంద్రాల్లో ఫ్రీ స్కూల్ విద్య అమలు**

**ఆటపాటలతో మానసిక శారీరక అభివృద్ధికి కృషి**

**3 నుండి 6 సం.ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి**

పాలకవీడు, జూలై 16 (తీన్మార్ న్యూస్): మంగళవారం పాలకవీడు మండలంలోని బొత్తల పాలెం గ్రామంలో అంగన్వాడి 1, 2 కేంద్రాల ఆధ్వర్యంలో జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా నూతనంగా రాష్ట్రంలో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు కందగట్ల ప్రేమలత, దేవరకొండ జానకమ్మ లు మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి 3 - 6 సంవత్సరాల పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో ఫ్రీ స్కూల్ విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినదని పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తెలిపారు. ఎవరూ కూడా ఇట్టి పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపకుండా ప్రభుత్వం ఇస్తున్నటువంటి పౌష్టికాహారం ఫ్రీ స్కూల్ విద్యను ఉపయోగించుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ గణిత భావనలు ఆటపాటలతో మేధో వికాసం శారీరక అభివృద్ధి సృజనాత్మక మరియు మంచి అలవాట్లు మానస మానసిక వికాసంతో కండరాల అభివృద్ధి చిన్నారుల బరువుల పెరుగుదల




అంగన్వాడీ టీచర్ల పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని వారు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం మెరుగైన పోషక ఆహారం గర్భిణీలకు బాలింతలకు పిల్లలకు అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారూ. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కందగట్ల ప్రేమలత దేవరకొండ జానకమ్మ తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి ఉప్పెల్లి బాబు ఆశా కార్యకర్త నాగ సుకన్య సంఘ బంధ నాయకురాలు కందగట్ల భానుమతి దేవరకొండ మరియమ్మ రామినేని కనకమ్మ వివోఏ సుందరి నాగమణి మరియు తల్లులు భోగాల పద్మ షేక్ మైబు కోన సంధ్య మట్టమ్మ వసంత తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వెళ్లే దారి బురదమయం

**నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు**

జనగామ, జులై 16 (తీన్మార్ న్యూస్): దారి ఇలా ఉంటే తాము పాఠశాలకు ఎలా వెళ్లేదంటూ విద్యార్థులు నిరసన చేపట్టగా తల్లిదండ్రులు, నాయకులు సహకరించారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు వెళ్లే రహదారిలో గ్రామంలోని మురుగు నీరు పాఠశాల సమీపంలో నిలుస్తోంది. చిరుజల్లులకే కుంటలా మారుతోంది. గతంలో గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే పాఠశాల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



# ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

## ముంపుకు గురికాకుండా చర్యలకు అధికారులకు ఆదేశాలు



పరకాల, జులై 16 (తీన్మార్ న్యూస్): పరకాల పట్టణం ముంపుకు గురికాకుండా ప్రణాళికాబద్ధంగా అంచలవారిగా నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తానని అందుకు ప్రజల సహకారం అవసరమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని వరద ముంపు ప్రాంతాలైన దామరచెరువు మత్తడి కాలువ, మాదారం బంధం రోడ్డు కల్వర్టు, ఆంధ్ర బ్యాంక్ వద్దగల డ్రైనేజీ, భూపాలపల్లి రోడ్డు కల్వర్టు, పద్మశాలి వాడ పోచమ్మ గుడి డ్రైనెజ్ పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సందర్శించారు. వర్షాకాలం నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలకు గురైన నాళాలను, డ్రైనేజీ వ్యవస్థను, అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను వెంటనే గుర్తించి, పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను చేపట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యక్రమంలో



ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న అత్యవసర సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దామర చెరువు మత్తడి కాలువ నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. చెరువుకట్ట పటిష్టతకు చేపట్టాల్సిన పనులను అంచనాలతో సహా రూపొందించాలని అన్నారు. అనంతరం ఆంధ్ర బ్యాంకు వద్దగల డ్రైనేజ్ నాలాపై వెలసిన అక్రమ నిర్మాణాల తొలగింపును వెంటనే చర్యలు చేపట్టామని తెలిపారు. పరకాల పట్టణం వరద ముంపు నుంచి కాపాడేందుకు తీసుకోవల్సిన చర్యలతో నివేదిక రూపొందించాలన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టవద్దని, ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా ఆక్రమణలను తొలగించి నాలాను విస్తరించాలన్నారు. తమ స్వలాభం కోసమే గత ప్రభుత్వ పాలకులు ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి అన్నారు. మురికి కాల్వల ఆక్రమణలను వెంటనే తొలగించి మురికి నీరు ఆగకుండా యధావిదంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి అన్నారు.అధికారులు తమ బాధ్యతలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని కోరినట్లు తెలిపారు.


# పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నివారణ

- రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి
- దోమల నివారణకు రెగ్యులర్ గా ఫాగింగ్ చేపట్టాలి
- పెండింగ్ పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి
- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ



ములుగు, జులై 16 (తీన్మార్ న్యూస్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధుల వ్యాప్తినీ అడ్డుకట్ట వేయవచ్చని, పారిశుధ్య నిర్వహణను అత్యధిక ప్రాధాన్యతతో చేపట్టాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రతి రోజూ రోడ్లను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని, డ్రైనేజీలను క్లీన్ చేయాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, రోడ్లపై ప్లాస్టిక్ కనిపించకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజూ ఉదయం వార్డ్ అధికారులు, సానిటేషన్ సూపర్ వైజర్ లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణ చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ఉంటే ఎక్కువ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటాయని అన్నారు. జిల్లాలో పారిశుధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగటం లేదని, అనేక ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిల్వ ఉండటంగమనించామని అన్నారు. గ్రామాలలో ఫాగింగ్ రెగ్యులర్ గా చేయాలని, వర్షం పడిన తర్వాత నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమలు పెరగకుండా ఆయిల్ బాల్స్ వేయాలని ఆమె సూచించారు. నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు పెరిగి వ్యాధిగ్రస్తులు అవుతారనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు పారిశుధ్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో నీరు నిల్వ అధికంగా ఉండే వల్నరబుల్ ప్రాంతాలను గుర్తించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ హాస్టల్ లను నేరుగా తనిఖీ చేసి పరిసరాలు పరిశుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, వంట చేసే ప్రాంతాలలో పాటించాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని, ఫుడ్ పాయిజనింగ్, సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఉదయం 7 గంటలకు పర్యటిస్తూ డ్రై డే నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ప్లాస్టిక్, చెత్త అధికంగా ఉండటానికి వీలు లేదని, జిల్లాలో ఉన్న డ్రైయిన్ లను రెగ్యులర్ గా శుభ్రం చేయాలని అన్నారు. సెగ్రిగేషన్ షెడ్ పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకుని రావాలని అదనపు కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులను సూచించారు. జిల్లాలో ఉన్న ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవో లు ఎంపీ ఓలు,పంచాయతీ సెక్రెటరీలు, టెక్నికల్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత



గోవిందరావుపేట, జులై 16 (తీన్మార్ న్యూస్): మంగళవారం గోవిందరావుపేట మండల కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గొవిందరావుపేట మండల తాసిల్దార్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సాదు రఘు చల్వాయి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు పులుగుజ్జు వెంకన్న ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకుడు పిట్టల వెంకటస్వామి మండల ముదిరాజ్ నాయకులు కంకణాల నరసయ్య నీరెడ్డి సాంబరాజు బండి రాజు బండి మల్లేశం పులు గుజ్జుసతీష్ వద్దులే సతీష్ కమటం కిరణ్ కక్కు సాంబయ్య ఆరే యాదగిరి పిట్టల నరసయ్య మారబోయిన సారయ్య గోనెల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడిలో సృజనాత్మకతతో కూడిన విద్య

## చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ పాఠశాలలే పునాది సూపర్ వైజర్ ధనలక్ష్మి



జవహర్ నగర్, జులై 16 (తీన్మార్ న్యూస్): అంగన్వాడీల్లో సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నామని, చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ పాఠశాలలే పునాది వేస్తున్నాయని సూపర్ వైజర్ ధనలక్ష్మి అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ రాజీవ్ గాంధీనగర్లో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ మూడేళ్ళ నుంచి ఆరేళ్ళలోపు చిన్నారులు అంగన్వాడీ పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తు అంగన్వాడీపాఠశాలల ప్రముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు, బస్తీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీటి వనరులను అధ్యయనం చేయండి

## పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి : ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో తెలంగాణ డిమాండ్

హైదరాబాద్: గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి కావాల్సిన నీటి వనరులను అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.తద్వారా 50 శాతం ప్రయోజనాలను తెలంగాణకు వర్తింప జేయాలని కోరింది. తెలంగాణ ప్రతిపాదించిన పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. సోమవారం ఢిల్లీలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ 73వ పాలకమండలి సమావేశం జరిగింది. దీనికి ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మెన్ దేబశీష్ ముఖర్జీ అధ్యక్షత వహించగా కేంద్ర జలశక్తి శాఖ ఉన్నతాధికారి భూపాల్‌సింగ్ సమన్వయం చేశారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కొందరు స్వయంగా, మరికొందరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మెన్ దేబశీష్ ముఖర్జీ స్వాగతోపన్యాసం చేశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి సంబంధించి చిన్న చిన్న అడుగులు పడుతున్నాయన్నారు. మున్ముందు మీ అందరి సహకారంతో పురోగతి సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణ నుంచి సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.అనిల్‌కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానికి సంబంధించి చర్చ ఈ సందర్భంగా చోటు చేసుకుంది. తెలంగాణ అధికారులు మాట్లాడుతూ గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి నీటి లభ్యత వనరులను అధ్యయనం చేయాలని సూచించారు. ఇచ్చంపల్లి దగ్గర నిర్మించే బ్యారేజీకి బదులుగా ఇప్పటికే నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచే నీళ్లను తరలించాలని కోరారు. ఆరు నెలల కిందట చెప్పిన విధంగా ఇచ్చంపల్లి దగ్గర బ్యారేజీ నిర్మిస్తే గోదావరి-కావేరి అనుసంధాన నదులకు, తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లను ఒకేసారి అందించడం సాధ్యం కాదన్నారు. సమ్మక్కసాగర్ బ్యారేజీకి బ్యాక్‌వాటర్ సమస్య ఏర్పడుతుందనీ, వరదల నిర్వహణ కష్టతరంగా మారుతుందని అన్నారు అలాగే రాష్ట్రానికి 158 టీఎంసీల నీటి అవసరాలకు సైతం నష్టం కలుగుతుందని చెప్పారు. నాగార్జునసాగర్ ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ఫిక్స్ చేయాలని సూచించారు. అలాగే ప్రాజెక్టుల వారీగా ప్రొటోకాల్‌ను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఇదంతా కేడబ్ల్యూటీటీ అధ్యయన నివేదిక వచ్చాకే తేల్చాలని అన్నారు. గత మార్చి 6, 2024న సాగునీటి శాఖ కార్యదర్శి రాసిన లేఖను యధాతథంగా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



ధర్మసాగర్: ఈ మధ్య కాలంలో జల్సాలు,క్రికెట్ బెట్టింగులకి అలువాటుపడి,అధిక డబ్బులు సంపాదించాలనే ఆశతో బ్యాటరీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి,రిమాండ్ కు పంపినట్లు స్థానిక సీఐ మహేందర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. తూర్పు గోదావరి జిల్లా తాళ్లరేవు మండలం,రంగనాయకపురం గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగేశ్వరరావు ప్రస్తుతం సికాంద్రబాద్ లో తన తల్లి తండ్రులతో నివాసం ఉంటూ గత కొద్ది రోజులుగా ఎవరికి అనుమానం రాకుండా హైదరాబాద్ లోని లాంగ్ డ్రైవ్ కార్స్ లో కారుని కిరాయికి తీసుకొని ధర్మసాగర్, చిలుపూర్, రఘునాథ్ పల్లి, జనగామ, బచ్చన్నపేట, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో ఆగి ఉన్న ట్రాక్టర్, టిప్పర్, లారీ లకి సంబంధించిన 25 బ్యాటరీలు దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు.ఈ నెల గత కొద్ది రోజులుగా, ధర్మసాగర్, చిలుపూర్, రఘునాథ్ పల్లి, జనగామ, బచ్చన్నపేట, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లలో వీటికి సంబంధించిన కేసులు నమోదు అయినవని ఆరోపించారు. పోలీస్ సిబ్బందితో రాంపూర్ హై వే రోడ్డు, వి.ఏం.ఆర్ కాలేజీ అంబేద్కర్ సెంటర్ వద్ద వాహన తనకీలు చేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి రెడ్ కలర్ హుందాయి ఐ-20 కారులో అతి వేగంగా వస్తు పోలీస్ వారిని చూసి,వాహనాన్ని ఆపకుండా వెళు తుండగా, అట్టివాహనాన్ని అపి తనకి చేయగా అందులో 12 బ్యాటరీలు ఉండడంతో,అట్టి వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని విచారించగా పూర్తి వివరాలు బయటపడ్డాయని తెలిపారు. ట్రాక్టర్, టిప్పర్, లారీ లకి సంబంధించిన 25 బ్యాటరీలు దొంగతనాలు చేసి,రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ధనలక్ష్మి రైస్ మిల్ వెనుకల గల చెట్ల పొదలలో దాచి ఉన్నాయని తెలిపారు.ఇట్టి బ్యాటరీల విలువ అందజా 1,50,000 రూపాయలు ఉంటుందన్నారు. అందులో నుండి 12 బ్యాటరీలను హైదరాబాద్ లో అమ్ముటకై రెడ్ కలర్ హుందాయి ఐ-20 కారులో తరలిస్తుండగా నిందితున్ని అదుపులోకి తీసుకొని జుడీష్యల్ కస్టడీకి రిమాండ్ కు పంపించడం జరిగిందన్నారు.ఇట్టి కేసును చేదించిన ధర్మసాగర్ సీఐ మహేందర్, ఎస్సైలు రాజు, నరసింహారావు,ఏఎస్ఐ పోచయ్య,క్రైమ్ సిబ్బంది సంపత్, కరుణాకర్ లను కాజీపేట ఏసిపి డేవిడ్ రాజ్ అభినందించారు.

# దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంది: ఎంపీ కడియం కావ్య




ధర్మసాగర్: దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంటుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడన్స్ ,ఆరోగ్య సంరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థల వికాసమే ప్రథమ ప్రాధాన్యతగా పని చేస్తానని అన్నారు.చీకటి నుండి వెలుగులోకి రావడం కోసం ,సామాజిక భద్రత హోదా పొందడంలో విద్య ముఖ్య సాధనమని అన్నారు.యంపి నిధుల నుండి ధర్మసాగర్ కళాశాల కోసం నా వంతు సహాయ సహకారాలతో ప్రత్యేక నిధులను కేటాయిస్తానని తెలిపారు.విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తాను స్థాపించిన కడియం ఫౌండేషన్ ద్వారా చేయూత అందిస్తానని తెలిపారు.నిత్య అధ్యయనం,సమాజ గమన గమ్యాలను పరిశీలన విద్యార్థి జీవితంలో భాగమవ్వాలని సూచించారు.సమాజ వనరులతో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో ఎదిగి సమాజానికి తిరిగి చెల్లించు వెలుగులో పని చేయాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.ఈ సందర్భంగా లక్ష రూపాయలు విలువ గల నోట్ బుక్స్,హెల్త్ కిట్స్ విద్యార్థులకు పంపిణీ చేసారు.ఫౌండేషన్ ప్రతినిధి,కళాశాల ప్రిన్సిపాల్ అన్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలలో మనకు కడియం శ్రీహరి కడియం కావ్య అండగా ఉంటారనే భరోసాతో విద్యార్థులు ఆకాశమే హద్దుగా ఎదగాలనే కాంక్షతో కృషి చేయాలని కోరారు.భారత రాజకీయాలలో రాజ్యాంగ విలువలను కాపాడే ఆశాకిరణంగా దారి దీపంగా కావ్య ప్రస్థానం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. అనంతరం అమెరికా ప్రవాస భారతీయ విద్యార్థులు అదిత్రి కార్తీక్ లు విద్యార్థులకు అవగాహన తరగతులను నిర్వహించారు.సమాజానికి తిరిగి చెల్లించు వెలుగులో మాతృ భూమి పై మమకారంతో గ్రామీణ పాఠశాలల కళాశాల విద్యార్థులకు కెరీర్ పరంగా పలు అంశాల పై అవగాహన కల్పించిన అదిత్రి కార్తీక్ లను సత్కరించారు.అనంతరం కడియం కావ్యను కళాశాల బృందం ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సీఐ మహేందర్, యన్ యస్ యస్ అధికారి జ్యోతి ,అధ్యాపకులు కనకయ్య, కరుణాకర్, గణేష్, వెంకట్రాజ్యం, బాబురావు, ఉపాధ్యాయులు తులసి, సరస్వతి లతో పాటు 250 కు పైగా కళాశాల పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 4వ బెటాలియన్ కమాండెంట్ గా బి.రామ్ ప్రకాష్



మామునూర్, జులై 16 (తీన్మార్ న్యూస్): నాలుగో బెటాలియన్ నూతన కమాండెంట్ గా బి.రామ్ ప్రకాష్ మంగళవారం ఉదయం ఇన్చార్జి కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, ఏవో నిర్మల, యూనిట్ హాస్పిటల్ డాక్టర్ అన్వేషణీ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శోభన్, పురుషోత్తం రెడ్డి ,వెంకటేశ్వర్లు, రాజిరెడ్డి, రమేష్, ఏవిఎన్ రెడ్డి, రాజ్ కుమార్, కిరణ్, అశోక్, కృష్ణ, మరియు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెరమీదకు ఆర్బీఐ బాండ్లు

హైదరాబాద్: మీరు మీ సంపాదనలో నుంచి ఏమైనా డబ్బులు పొదుపు చేస్తున్నారా. ఇంకా దీనిని పెట్టుబడుల రూపంలో పెడుతున్నారా? ఇంకా చాలా మంది ఎక్కువ వడ్డీ ఆఫర్ చేసే పెట్టుబడి మార్గాల కోసం చూస్తుంటారు. ఇంకా తమ సొమ్ముకు రక్షణ కావాలని కోరుకుంటారు. ఎక్కువగా వీరు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడులు పెడుతుంటారు. రిజర్వ్ బ్యాంక్ కొంత కాలంగా రెపో రేట్లను గరిష్ఠ స్థాయిల వద్ద ఉంచిన సమయంలోనే బ్యాంకులు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. అయితే బ్యాంక్ ఎఫ్‌డీల కంటే కూడా కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్న ఒక స్కీమ్ ఉంది. అదే ఆర్బీఐ తీసుకొచ్చిన ఫ్లోటింగ్ సేవింగ్స్ బాండ్లు. వీటిపై అధిక వడ్డీ సహా ఆర్బీఐ అదే ఆర్బీఐ తీసుకొచ్చిన ఫ్లోటింగ్ సేవింగ్స్ బాండ్లు. వీటిపై అధిక వడ్డీ సహా ఆర్బీఐ సార్వభౌమ గ్యారెంటీ కూడా వస్తుంది. దీంతో మీ డబ్బులకు పూర్తి భద్రత ఉంటుంది.

ౚౚ ఆర్బీఐ బాండ్లలో వడ్డీ రేటు ఎప్పుడూ ఒకేలా ఉండదు. స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్‌లోని నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఔూఅ) వడ్డీ రేటుతో ఇది ముడిపడి ఉంటుంది. ఔూఅ వడ్డీ రేట్లు ఆర్బీఐ బాండ్స్ వడ్డీ రేట్లు కూడా పెరుగుతాయి. అక్కడ వడ్డీ తగ్గితే ఇక్కడ కూడా తగ్గుతుందని చెప్పొచ్చు. అయితే ఔూఅ అందించే వడ్డీ రేటు కంటే ఇందులో 0.35 శాతం వడ్డీ ఎక్కువ లభిస్తుంది.ప్రతి 6 నెలలకు ఓసారి ఇక్కడ వడ్డీ రేట్లను సవరిస్తుంటుంది ఆర్బీఐ. 2024 జులై-డిసెంబర్ అర్ధ వార్షికానికి సంబంధించి జులై 1న ఆర్బీఐ కొత్త వడ్డీ రేట్లు ఖరారు చేసింది. ఎన్ఎస్‌సీ వడ్డీ రేటు ప్రస్తుతం 7.7 శాతంగా ఉండగా.. ఆర్బీఐ బాండ్లపై 8.05 శాతం వడ్డీ వస్తుంది. ఏడాదిలో రెండు సార్లు జనవరి 1, జులై 1న వడ్డీ మీ అకౌంట్లో జమవుతుంది.

ౚౚ ఆర్బీఐ బాండ్ల కాల వ్యవధి ఏడేళ్లు. దీంట్లో ముందస్తు ఉపసంహరణకు అవకాశం లేదు. సీనియర్ సిటిజెన్స్ మాత్రం కనీస లాకిన్ పీరియడ్ తర్వాత పెనాల్టీతో ముందుగా డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇక 60-70 మధ్య వయస్కులకు ఆరేళ్లు, 70-80 మధ్య వయసు ఉంటే ఐదేళ్లు, 80 ఏళ్లు దాటిన వారికి నాలుగేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. కనీసం రూ. 1000 పెట్టుబడితో ఈ బాండ్లు కొనొచ్చు. గరిష్ఠంగా ఎలాంటి పరిమితి లేదు. వడ్డీ రేటు పెరగొచ్చు లేకపోతే తగ్గొచ్చు. అందుకే భవిష్యత్తులో వడ్డీ తగ్గితే రాబడిపైనా ప్రభావం ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఇంకా బాండ్స్‌పై వచ్చే వడ్డీపై పన్ను చెల్లించాలి. లోన్ అవకాశం ఇక్కడ లేదు.

ౚౚ వడ్డీ ఎక్కువ వస్తున్నప్పటికీ.. ఏడేళ్ల వరకు డబ్బుతో అవసరం లేదనుకున్న వారు దీంట్లో ఇన్వెస్ట్ చేయొచ్చు. స్థిర వడ్డీ రావాలంటే ఇందులో పెట్టుబడి పెట్టొద్దు. ఎఫ్‌డీ ప్రత్యామ్నాయం కోసం చూస్తే ఇందులో పెట్టుబడులు పెట్టొచ్చు. సీనియర్ సిటిజెన్లకు బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. ఆర్బీఐ గుర్తింపు పొందిన ఏ బ్యాంకులో అయినా దీనిని కొనుగోలు చేయొచ్చు. కేవైసీ పత్రాలు సమర్పించాలి.

# ఫైవ్ స్టార్ ను తలపిస్తున్న రైల్వే స్టేషన్

హైదరాబాద్, ఇండియన్ రైల్వే దేశానికే తలమానికంగా నిలిచే సంస్థ. సామాన్యులకు తక్కవ ధరలోనే గమ్యస్థానానికి చేర్చే రైల్వే రవాణా మన జీవన విధానంలో ఓ భాగమైపోయింది. ప్రయాణికులను సకాలంలో గమ్యస్థానానికి చేరుస్తూ సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. విశ్వనగరంగా పేరుగొంచిన హైదరాబాద్ నగరంలో మరో సరికొత్త ప్రాజెక్టు రూపుదాల్చబోతోంది. ఆ ప్రాజెక్టు అందుబాటు లోకి వస్తే భాగ్యనగర వాసులకు నిజంగా పండుగే. అదే చర్లపల్లి రైల్వే టెర్మినల్..అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో దేశంలోని ఎయిర్ పోర్టులకు ఏ విధంగా తీసిపోని విధంగా నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమయింది.చర్లపల్లి టెర్మినల్ తో సికింద్రాబాద్, కాచిగూడ , నాంపల్లి స్టేషన్లపై ప్రయాణికుల రద్దీని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. రూ.434 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తేనున్నారు. అన్నీ సవ్యంగా జరిగితే సార్వత్రిక ఎన్నికలకు ముందే ప్రారంభించవలసింది. అయితే ఎన్నికల కోడ్ దృష్ట్యా చాలా మటుకు పెండింగ్ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇప్పటికే 98 శాతం పూర్తయినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.ఈ స్టేషన్ అందుబాటులోకి వచ్చాక ప్రతినిత్యం 50 రైళ్లు తిరిగేందుకు అవకాశం ఉంటుందంటున్నారు. అలాగే రోజుకు 25 వేల మంది ప్రయాణించేందుకు వీలుంటుంది. రానున్న రోజుల్లో రైళ్లు పెరిగే కొద్దీ ప్రయాణికుల సంఖ్య మరింత పెరగవచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు.ఇక్కడ కల్పించిన సదుపాయాలు చూస్తే షాకింగే..ప్రయాణికుల సౌలభ్యం కోసం 9 ఎస్కలేటర్లు, 5 లిఫ్టులు కల్పించారు. అలాగే రెండు సబ్‌వే లు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. చర్లపల్లి రైల్వే స్టేషన్ చుట్టుపక్కల రహదారులను విస్తరించారు. ఎంఎంటీఎస్ రైళ్లను అనుసంధానీకరించే ప్రక్రియను వేగవంతం చేశారు. చర్లపల్లి టెర్మినల్ భవనం మొదటి అంతస్థులో ఆడవారికి, మగవారికి వేర్వేరుగా విశ్రాంతి గదులు, క్యాంటీన్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఇక గ్రౌండ్ ఫ్లోర్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్లు ఆరు ఉన్నాయి. ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేశారు. రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు కూడా ఉన్నాయి.24 గంటలు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రయాణికులు వాహనాలు నిలిపేందుకు అతి విశాలమైన పార్కింగ్ ప్లేస్ కూడా ఉంది. గోరఖ్ పూర్ టూ సికింద్రాబాద్, షాలిమార్ టూ సికింద్రాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్ ప్రెస్, చెన్నై టూ నాంపల్లి చార్మినార్ ఎక్స్ ప్రెస్ రైళ్లను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నారు. త్వరలోనే మరిన్ని రైళ్లు ఇక్కడ హాల్టింగ్ కోసం ఆగనున్నాయి. శాతవాహన ఎక్స్ ప్రెస్, సిర్పూర్ కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, తదితర రైళ్లు ఇప్పటికే హాల్డింగ్ పాయింట్ కింద నిలుపుతున్నారు రైల్వే అధికారులు. త్వరలోనే ప్రధాని మోదీ త్వరలో చర్లపల్లి టెర్మినల్ ను ప్రారంభించనున్నారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య లెక్కింపు షురూ

భువనేశ్వర్, దాదాపు 46 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు రత్న భాండాగారం రహస్య గదిని ఒడిశా అధికారులు తెరిచారు. జగన్నాథుడి సేవలకు ఆటంకం లేకుండా భాండాగారాన్ని తెరిచినట్లు సీఎంవో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం లోపలికి వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ముందస్తుగా నిర్ణయించిన సమయం ప్రకారం 1.28గంటలకు రహస్య గదిని ఓపెన్ చేశారు. సాయంత్రం 5.20 గంటలకు బయటకు వచ్చారు. రత్న భాండాగారంలో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను త్వరలో లెక్కించనున్నారు. నిధిని తరలించేందుకు చెక్క పెట్టెలను రెడీ చేసినట్లు సీఎంవో స్పష్టం చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆ రత్న భాండాగారంలో ఎన్ని లక్షల కోట్ల నిధి దాగింది.. అసలు అందులో ఏం జరిగింది అనే దాని పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలిరోజు రత్న భాండాగారం మూసివేసిన తరువాత ఆలయ ప్రధానాధికారి అరవింద పాఢీ పలు విషయాలు వెల్లడించారు. అరవింద పాఢీ మాట్లాడుతూ.. "తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూశాం. భాండాగారానికి మూడు తాళాలు ఉన్నాయి. జిల్లా అధికారుల వద్ద ఉన్న ఏ తాళం చెవి పని చేయలేదు. దాంతో ముందుగానే నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం, మేజిస్ట్రేట్ సమక్షంలో 3 తాళాలు పగలగొట్టాం. అనంతరం గది లోపలికి వెళ్లి, లోపల బీరువాలో, చెక్క పెట్టెల్లో ఉన్న ఆభరణాలను చెక్ చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత సమయం తరువాత స్ట్రాంగ్ రూమ్‌ను సీల్ చేశాం. విలువైన వస్తువులను ఒకేసారి తరలించాలి. అందుకు మరింత టైం పడుతుంది. కనుక వాటిని తరలించకూడదని కమిటీ నిర్ణయం తీసుకుంది. బహుద యాత్ర, సున వేష పూజలు నిర్వహించి తర్వాత వాటిని తరలించే తేదీని నిర్ణయిస్తాం" అన్నారు.పూరీ రత్న భాండాగారానికి సంబంధించి మె?త్తం మూడు గదులు ఉంటాయి. మె?దటిది స్వామి వారికి పూజలో భాగంగా ప్రతీ రోజూ తెరుస్తారు. రెండవది ముఖ్యమైన సందర్భాల్లో తెరుస్తారు. ఇక మూడవదే అసలైన రత్న భాండాగారం. దీనిని 46 ఏళ్ల కిందట అంటే 1978లో ఓపెన్ చేశారు. ఇప్పటి వరకు మళ్లీ తెరవలేదు. తెరచేందుకు మధ్యలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి.. కానీ విఫలమయ్యాయి. గదిలో అంతులేని సంపద ఉందని అక్కడి ప్రజల అపార నమ్మకం. ఈ గదికి నాగబంధం కూడా ఉందని చెబుతారు. గతంలో తెరిచినప్పుడు పాము కనిపించిందని అంటారు. ఈ ఖజానాను పాములు రక్షిస్తూ ఉంటాయని అక్కడి ప్రజలు చెబుతుంటారు. అందుకే ఈ రోజు రత్న భాండాగారం తెరిచే సమయంలో పాములు పట్టే వ్యక్తులను కూడా తీసుకెళ్లారు. అంతేకాదు సాంకేతికతను కూడా ఉపయోగించారు. ఎవరికి ఎలాంటి అపాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఏదైనా సమస్య వస్తే.. వెంటనే చికిత్స చేసేందుకు డాక్టర్లను అందుబాటులో ఉంచారు. రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ గురించి తెలిసి చాలా మంది గుడికి వచ్చే ప్రయత్నం చేశారు. దీంతో గుడి పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. రత్న భాండాగారంలోని అంతులేని సంపదను కమిటీ సభ్యులు పెట్టెల్లో భద్రపరుస్తారు. అందుకే ప్రత్యేకంగా తయారు చేసిన ఆరు పెట్టెలను తీసుకెళ్లారు. ఆ తర్వాత వాటిని డిజిటల్ డాక్యుమెంటేషన్ కూడా చేస్తారు. 1978లో ఖజానాలోని సంపదను లెక్కించేందుకు దాదాపు 70 రోజులు పట్టింది. అయినా కూడా లెక్క తేలలేదని చెబుతుంటారు. పూరీ జగన్నాథుని ఖజానాలో వజ్రాలు, కెంపులు, రత్నాలు, బంగారు ఆభరణాలు, వెండి మొదలైన విలువైన వస్తువులు ఉన్నాయని చెబుతారు. రాజుల కాలంలో కూడా స్వామికి చేయించిన నగలు ఇందులో దాచారని కొందరు అంటారు. స్వామివారి సంపదపై అందరిలో ఆసక్తి నెలకొంది. పూర్వ కాలంలో, ప్రతి మూడు లేదా ఐదు సంవత్సరాలకు, ఈ గది తలుపులు తెరిచి సంపద లెక్కించేవారు. చివరిసారి తెరిచినప్పుడు కొన్నింటిని వదిలేయడంతో లెక్కల్లో కొంత గందరగోళం నెలకొంది. అనంతరం హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన కోర్టు.. ట్రెజరీని తెరిచి సంపదను లెక్కించాలని ఆదేశించింది. దీంతో తాజాగా పూరీ జగన్నాథ్ రత్న భాండాగారం తెరచుకుంది.

# ఉద్యోగాలపై కాంగ్రెస్ రూట్ మ్యాప్

హైదరాబాద్: తెలంగాణ రాకముందు ఏళ్లుగా పోరాటం.. తెలంగాణ వచ్చాక కూడా పదేళ్లుగా పోరాటం.. దేనికి ఉద్యోగాల కోసం. ఉన్న ఇంటిని విడిచి.. కోచింగ్ సెంటర్లకు వేలల్లో ఫీజులు కట్టి.. సగం తిని.. తినకా చెట్ల కింద కూర్చొని చదివేది ఎందుకు.. ? నోటిఫికేషన్లు పడతాయని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు వచ్చి ఉద్యోగాలు సాధించే సమయం వచ్చే సరికి మళ్లీ అవే ఆందోళనలు. ఈసారి నోటిఫికేషన్లను వాయిదా వేయాలని.. ఇదేక్కడి లాజిక్.. ? మనం ఇన్నేళ్లుగా పోరాటాలు చేసింది ఈ ఉద్యోగాల కోసమే కదా.. తీరా చేతి వరకు వచ్చాక మళ్లీ వాయిదాలు వేస్తూ పోతే.. పరీక్షలు నిర్వహించేది ఎప్పుడు? ఫలితాలు వచ్చేదెప్పుడు? అందుకే ఈ విషయంలో ఎక్కడా తగ్గేది లేదంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. ఏదీ ఏమైనా నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించి తీరుతామంటున్నారు. కొందరి రాజకీయ కుట్రకు నిరుద్యోగులు బలి కావొద్దని సూచిస్తున్నారు.పుస్తకాల్లో ఉన్న చదువులు.. బయట మార్కెట్‌లో సమాజానికి అసలేమైనా సంబంధం ఉందా? ఈ చదువులు చదివి బయటికి వచ్చిన వారికి ఉద్యోగాలు వస్తున్నాయా? ప్రతి ఏటా లక్షలాది మంది చేతుల్లో సర్టిఫికేట్లు ఉంటున్నాయి తప్పా.. వారిలో పనితనం ఉంటుందా? ఇవే ప్రశ్నలను సూటిగా వేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.. క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు.కాలేజీలంటే ఏంటి.. ? ఉన్నత విద్యతో పాటు.. ప్రపంచానికి తగ్గట్టుగా అవసరమైన స్కిల్స్‌ను తయారు చేసే సంస్థలు.. విద్యా సంస్థలు.. కానీ బాధించాల్సిన విషయం ఏంటంటే.. ఇప్పుడు ఇంజనీరింగ్ కాలేజీలు అన్ని కూడా నిరుద్యోగ కర్మాగారాలుగా మారాయి. ఇదే విషయాన్ని చెప్పారు రేవంత్ రెడ్డి. ఇంజనీరింగ్ కాలేజీలన్ని నిరుద్యోగులను తయారు చేసే కర్మాగారాలుగా మారొద్దన్నారు ఆయన. అంతేకాదు.. ప్రపంచంలో అద్భుతాలు సృష్టించింది ఇంజనీర్లే అని. సీవిల్ అండ్ ఐటీపై ఇంజనీరింగ్ కాలేజేస్ ఫోకస్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇంజనీరింగ్ అంటే కేవలం కంప్యూటర్ సైన్స్ మాత్రమే కాదు.. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులను కూడా కాలేజీలు ప్రోత్సహించాల్సిదే. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా భాగస్వామ్యంతో 2వేల 400 కోట్లతో ప్రభుత్వం ఐటీఐల రూపురేఖలను మారుస్తుంది. నిజానికి కాలేజీలకు ఓ విజన్ ఉండాలి. ప్రస్తుతం ఫార్మా, ఐటీ తరువాత నెక్ట్ ప్రపంచాన్ని ఏలబోయేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. కాబట్టి కాలేజీలన్ని కూడా ఏఐపై ఫోకస్ చేయాలని సూచించారు రేవంత్.. ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని.. అలా చేసేందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని కాలేజీలకు సూచించారు రేవంత్.లెటెస్ట్‌గా జరుగుతున్న నిరుద్యోగ సమస్యలపై కూడా రేవంత్ రియాక్ట్ అయ్యారు. పదేళ్లు ఉద్యోగాల భర్తీ చేయాలని నిరుద్యోగ యువత కొట్లాడిన యువత. ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆమరణ దీక్షలు చేయడంపై తీవ్రంగా స్పందించారు. నిరుద్యోగులను తప్పుదోవ పట్టించేందుకు ఎవరెన్ని కుట్రలు, ప్రయత్నాలు చేసినా వారి మంచి కోసం తాము ఎప్పుడూ పోరాడుతూనే ఉంటామని త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను తీసుకురాబోతున్నామని యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని మరోసారి క్లారిటీ ఇచ్చారు.మొత్తంగా చూస్తే.. ఉద్యోగాలు కల్పించే విషయంలో తాము ఎక్కడా వెనక్కి తగ్గడం లేదని రేవంత్ క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా.. ఉద్యోగాలు సాధించాలంటే.. సరైన స్కిల్స్ నేర్చుకోవాలని ఆ స్కిల్స్‌ను నేర్పే కాలేజీలు పటిష్ఠంగా ఉండాలని చెబుతున్నారు. నిరుద్యోగాన్ని రూపుమాపాలంటే.. మొదట ప్రపంచ అవసరాలకు తగ్గట్టుగా సిలబస్‌ను మార్చాలి. అలా మార్చితేనే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందనేది సీఎం రేవంత్ ఆలోచన.

# భారీగా పెరిగిన పప్పు దినుసులు

హైదరాబాద్, సామాన్యులకు నిత్యవసర సరుకులు ధరలు షాక్‌లు మీద షాక్‌లు ఇస్తున్నాయి. ఆకాశాన్నంటిన ధరలతో పేదలు, సగటు వేతనజీవి బెంబేలెత్తిపోతున్నారు. మె?న్నటి వరకు కేజీ టమోటా రూ.100కు పైగా పలకగా.. క్రమంగా ఆ ధరలు తగ్గుతున్నాయి. టమాట ధరలు తగ్గుతున్నాయని ఆనందపడే లోపే.. కందిపప్పు ధరలు కొండెక్కి కూర్చొని సామాన్యుడికి పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి.నిన్న మె?న్నటి వరకు కేజీ రూ.140-160 మధ్య ఉన్న కంది పప్పు ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం కిలో కంది పప్పు ధర రూ. 180-200 వరకు విక్రయిస్తున్నారు. సూపర్ మార్కెట్లలో క్వాలిటీని బట్టి కేజీ రూ. 220-240 వరకు కూడా ధర పలుకుతోంది. ఇక కందిపప్పుతో పాటు మిగతా పప్పుల ధరలు కూడా పెరిగాయి. కేజీ పెసరపప్పు గత నెల క్రితం రూ. 100 ఉండగా.. ప్రస్తుతం రూ. 120కి చేరింది. ఉల్లి ధరలు కూడా ఘాటెక్కాయి. వాటిని కోయకుండానే కన్నీరు పెట్టిస్తున్నాయి. గతంలో కేజీ ఉల్లి రూ. 25కు లభించగా.. ప్రస్తుతం రూ. 50కి చేరింది. చిరు వ్యాపారులు రూ.100కు నాలుగు కేజీల చొప్పున విక్రయించగా.. ప్రస్తుతం రూ.100 రెండు, రెండున్న కేజీలు మాత్రమే ఇస్తున్నారు. గతేడాది వర్షాభావం వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పత్తి 40 శాతం వరకు తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. అందువల్లే ధరలు విపరీతంగా పెరిగాయని అంటున్నారు.ఇక సండే రోజు చికెన్, మటన్ తినాలనుకున్న నాన్ వెజ్ ప్రియులకు కూడా వాటి ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. చికెన్ ధరలు ఇంకా దిగి రావటం లేదు. ప్రస్తుతం కేజీ చికెన్ రూ. 270-300 మధ్య పలుకుతోంది. ఇక మటన్ విషయానికొస్తే కేజీ రూ. 800 నుంచి రూ. 1000 మధ్య పలుకుతోంది. దీంతో సండే పూట ముక్కతో విందు భోజనం చేసుకుందామని అనుకున్న భోజన ప్రియులకు నిరాశే ఎదురవుతోంది. భారీగా పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని నిట్టూరుస్తున్నారు.

# డ్రగ్స్ అరికట్టేందుకు ప్లాన్

హైదరాబాద్, రాష్ట్రంలో డ్రగ్స్ ను అరికట్టేందుకు ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాల పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు జరగకుండా, విద్యార్థులు వాటి బారిన పడకుండా ప్రహరీ క్లబ్ లు నిఘా పెట్టనున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం ఆదేశాలు జారీ చేశారు. పిల్లలను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరం చేయడానికి ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయనున్నారు.పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా హెడ్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ ఉండనున్నాడు. వైస్ ప్రెసిడెంట్ గా సీనియర్ టీచర్ లేదా ఫ్రెండ్లీ టీచర్ ఉంటారు. 6 నుంచి పదో తరగతి వరకు ప్రతి క్లాసులో ఇద్దరు విద్యార్థులు, స్థానికంగా ఉండే పోలీస్ స్టేషన్ నుంచి ఒక పోలీస్.. పేరెంట్స్ నుంచి ఒకరు ప్రహరీ క్లబ్ లో సభ్యులుగా ఉండనున్నారు.

విద్య సంస్థల్లోకి మత్తు పదార్థాలు చేరకుండా, విద్యార్థులు వాటి ఊబిలో చిక్కుకోకుండా అవసరమైన ప్రణాళికలను ప్రహరీ క్లబ్ లు రూపొందిస్తాయి.ప్రస్తుతానికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఈ ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి గైడ్ లైన్స్ ను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనున్నది.

# గులాబీ, కాషాయం మధ్య డీల్...

హైదరాబాద్, తెలంగాణ రాజకీయం రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ ఉనికే ప్రశ్నార్థకం అయింది. ఓవైపు కాంగ్రెస్ పార్టీ, గులాబీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను లాగేసుకుంటోంది. ఇంకోవైపు బీజేపీ సైడ్ నుంచి కూడా కేసీఆర్‌పై ఒత్తిడి నెలకొంది. కవిత కోసం కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీలో జరిపిన మంతనాలు సక్సెస్ అయ్యాయి కానీ, కమలనాథులు పెట్టిన కండిషన్స్‌తో తీవ్ర చర్చల్లో ఉన్నారు కేసీఆర్. అయితే, దశల వారీగా విలీన ప్రక్రియ కొనసాగనున్నట్టు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అదే నిజమైతే, కేటీఆర్ భవిష్యత్తు ఏంటనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అడ్డంగా దొరికిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ కుమార్తె కవిత, ప్రస్తుతం తీహార్ జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారు. ఆమెను బయటకు తీసుకొస్తామని పార్టీ కార్యకర్తలకు చెప్పిన కేటీఆర్, ఢిల్లీకి వెళ్లి బీజేపీ పెద్దలతో మంతనాలు జరిపినట్టుగా ప్రచారం జరుగుతోంది. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం, కవిత అప్రూవర్ కండిషన్స్‌తో కమలనాథులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే విలీన ప్రక్రియ దశలవారీగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు కాంగ్రెస్ నేతలు.బీజేపీలో బీఆర్ఎస్ విలీన వార్తల నేపథ్యంలో టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ సామ రామ్మోహన్ సంచలన ట్వీట్ చేశారు. బీజేపీతో బీఆర్ఎస్ విలీనం వాయిదాల పద్ధతిలో జరుగుతుందని చెప్పారు. దశల వారీగా విలీనం ఉటుందన్న ఆయన, ముందుగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు కమలం గూటికి చేరబోతున్నారని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీ టూర్‌లో డీల్ కుదిరిందని, ఢిల్లీ రాయబారంలో కీలక ఒప్పందం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులుగా రామోదర్ రావు, పార్థసారధి రెడ్డి, సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. ఈ మధ్యే కే కేశవరావు కాంగ్రెస్ గూటికి చేరారు.అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న బీజేపీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా ఓట్ షేర్‌ను భారీగా పెంచుకుంది. ఇదే అదునుగా నెక్ట్ ఎలక్షన్‌లో అధికారం దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. అయితే, రాష్ట్ర బీజేపీ నేతలు త్వరలోనే భారీ చేరికలుంటాయని కొద్ది రోజులుగా చెబుతున్నారు. ఇప్పటిదాకా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లోనే చేరారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీల చేరిక ఉంటుందని హైకమాండ్ నుంచి వచ్చిన సంకేతాల నేపథ్యంలోనే రాష్ట్ర బీజేపీ నేతలు భారీగా చేరికలుంటాయని అంటున్నట్టుగా రాజకీయ వర్గాల్లో అంచనాలున్నాయి.వారం రోజుల్లోనే బీఆర్ఎస్ చేరికల ప్రక్రియ పూర్తవుతుందని ఢిల్లీ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. మరి, కేటీఆర్ భవిష్యత్తు ఏంటనే చర్చ ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే, బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తే, కేటీఆర్ రాజకీయ భవిష్యత్తు ముగిసినట్లేనంటున్నారు ఆ పార్టీ నేతలు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇంతకాలం బీఆర్ఎస్‌లో తిరుగులేని అధికారం చెలాయించారు ఆయన. తాను ఎంత చెప్తే అంతే అన్నట్టుగా నడిచింది. బీజేపీలో విలీనమై, బీఆర్ఎస్ కనుమరుగైతే కేటీఆర్ తెరమరుగవుతారా? అనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# కానరాని జాగ వాన

హైదరాబాద్, నైరుతి రుతుపవనాలు ముందుస్తుగా వచ్చినా.. భారీ వర్షాల జాడేలేదు. వరినార్లకు పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వానకాలం సీజ్ ముగుస్తున్నా వాన జాడేలేదంటూ తెలంగాణలో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చాయన్న ఆనందం రైతన్నకు లేకుండా పోయింది. వర్షాలు లేక అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఖరీఫ్ కాలం కరిగి పోతున్నా.. వరుణుడు కరుణించడం లేదు. వర్షాలు లేకపోవడంతో బోర్లకు నీళ్లురాక, బావులు ఎండిపోయిన పరిస్థితి నెలకొంది. నారుమళ్లు, ఆరుతడి పంటలు ఇప్పటికే ఎండిపోతున్నాయి. నారుమళ్లు కాపాడుకునేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. ట్యాంకర్లతో నీళ్లు కొని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడులే కాకుండా ట్యాంకర్లకు ఎక్స్‌ట్రాగా ఖర్చుచేస్తున్నామని చెబుతున్నారు. ఆరుద్ర దాక వేచి చూస్తాం.. ఆ తర్వాత దేవుడే కాపాడాలంటున్నారు రైతులు. చెరువులకు నీళ్లు తరలించి రైతన్నలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.భారీ వర్షాలు లేకపోవడంతో రాష్ట్ర వ్యా?ప్తంగా రైతులు డైలమాలో పడ్డారు. అటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతన్నలు పొలాలను బీడుభూముల కింద వదిలేశారు. వర్షాలు కురుస్తాయని ముందస్తుగా నార్లు వేసిన రైతులు.. అది ముదిరిపోతున్నా.. ఇప్పటికీ వాన జాడలేక ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు ఉంటాయని అధికారులు చెప్పడంతో ముందస్తుగా భారీ ఎత్తున వరి నార్లు పోసిపెట్టుకున్నామని.. నారు టైంలోపు నాటు వేయకుంటే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందంటున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. అయకట్టు ప్రాంతంలోని పొలాలు కూడా దున్నలేని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు లేకపోవడంతో ఇప్పటివరకూ పెట్టిన పెట్టుబడులు వృధాగా పోతాయంటూ ఆవేదన చెందుతున్నారు రైతులు.ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. కర్నూలు జిల్లాలో వర్షాలు కూరవాలని గ్రామంలో ఉన్న నాగదేవతలకు నీటితో అభిషేకాలు చేస్తున్నారు. వర్షం కోసం మొక్కని దేవుడు లేడు. చేయని పూజలు లేవు.. పలకని మంత్రం లేదని నిరుత్సాహాన్ని వ్యక్తబరుస్తున్నారు. భూమి దున్ని విత్తునాటినా వర్షాలు రాకపోవడంతో వానదేవుడి కరుణ కోసం ప్రజలు వివిధ రకాల్లో పూజలు చేస్తున్నారు. ఋతుపవనాల కదలిక ప్రకారం ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభం కావలసి ఉన్నా సరైన సమయానికి వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా త్వరగా వర్షాలు కురవాలని వరుణ దేవుని ప్రార్థిస్తూ, పురాతన ఆచారాలను నమ్ముకుని ప్రత్యేక పూజలు చేస్తున్నామంటున్నారు గ్రామస్తులు. ఇలా తెలుగురాష్ట్రాల్లో వరుణుడి ప్రభావం రైతులపై తీవ్రంగా పడుతోందని చెప్పవచ్చు. రుతుపవనాలు దేశ వ్యాప్తంగా చురుగ్గా కదులుతున్నప్పటికీ అటు ఏపీ, తెలంగాణలో అనుకున్నంత స్థాయిలో ప్రభావం చూపడం లేదని తెలుస్తోంది.

# రోడ్డు పై భారీ కొండ చిలువ

ఖమ్మం: ఖమ్మం జిల్లా మధిర మండలం మాటూరుపేట లింక్ రోడ్డు నుండి అంబారుపేట వెళ్లే రహదారిలో రోడ్డుపై భారీ కొండచిలువ రావడంతో వాహనదారుల ఒక్కసారిగా భయాందోళనకు గురైయ్యారు. అయితే కొండచిలువ రోడ్డు దాటి పొలాల్లోకి వెళ్లిపోవడంతో వాహనదారుల వెళ్లిపోయారు.అడవి ప్రాంతంలో ఉండే కొండ చిలువ మైదన ప్రాంతంలో కనిపించడంతో ఒక పక్క భయం మరోపక్క ఆసక్తిగా తిలకించారు.

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

**బాధితులనే బాధించే అవకాశం**

**కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం**

**నూతన చట్టాలు - సమాజంపై ప్రభావం**

**సెమినార్ లో సీనియర్ న్యాయవాది. విద్యాసాగర్ రెడ్డి**




ఖమ్మం: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో విద్యాసాగర్రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకుషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని కేవలం 43గంటల 23 సెకన్లు మాత్రమే చర్చించారని ఆయన తెలిపారు. పేరు బ్రిటిష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బిజెపి మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తీసుకు వచ్చారని ఇందులో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని ఆయన తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భారతీయ సాక్ష్యా సంహిత చట్టాలను తీసుకు వచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. పార్లమెంటులో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్ గా రూపొందించబడిందని ఆయన తెలిపారు. ఈ చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణలోకి తీసుకో లేదని ఐపిసిలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో 358కి కుదించారని ఆయన తెలిపారు. 124 ఎ సెక్షన్లో గతంలో ఉన్న రాజ ద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తీసుకు వచ్చారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 163వ సెక్షన్ సోషల్ మీడియాలో ఈ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రచారం నిర్వహించినా దేశ ద్రోహం కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కొన్నింటిలో పోలీసుల జోక్యాన్ని తగ్గించారని ముఖ్యంగా తూనికలు, కొలతలకు సంబంధించి గతంలో పోలీసులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసే వారని కానీ ఇప్పుడు పోలీసులకు అవకాశం లేదని కేవలం ఆ శాఖాధికారులు మాత్రమే తనిఖీలు నిర్వహించనున్నారని తెలిపారు. కొన్ని చట్టాలను కఠినతరం చేశారని గతంలో సాధారణ శిక్షల స్థానే ఇప్పుడు జీవితకాల ఖైదు, మరణ శిక్షను సైతం విధించేవిధంగా చట్టాలను రూపొందించారన్నారు. ఇప్పుడు 16 ఏళ్ల లోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీసం 20 ఏళ్లు శిక్షపడే అవకాశం ఉందన్నారు. గతంలో జీవిత ఖైదు అంటే కొన్నేళ్లకు పరిమితమయ్యేదని కానీ ఇప్పుడు సహజ సిద్దమైన జీవితం ఉన్నంత కాలం ఖైదు విధించే అవకాశం ఉ ందన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024 నుంచి అమల్లోకి వచ్చిన గతంలో ఐపిసి ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఫోక్సో లాంటి కేసుల్లో బాధితురాలి పేరును కానీ, కుటుంబ పేరును కానీ విచారణ పూర్తయ్యేంత వరకు బహిర్గత పర్చరాదని పోలీసులు సైతం వివరాలు సీల్డ్ కవర్లో న్యాయమూర్తికి అందించి పేరుకు బదులు బాధితురాలి పేరును వాడాల్సి ఉంటుందని విద్యా సాగర్ రెడ్డి సూచించారు. మీడియా సైతం బాధితురాలి పేరును ఉచ్చరిస్తే శిక్షించే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో ఉన్న చట్టాలను ఇప్పుడు తీవ్రతరం చేశారని ఢీకొట్టి పారిపోవడం లాంటివి చేస్తే పదేళ్ల వరకు శిక్ష ఉండే అవకాశం ఉందని నాన్బెయిలబుల్ కేసులు 102 (2) బిఎన్ఎస్ ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ప్రభుత్వాల పట్ల కానీ, ప్రజాప్రతినిధుల పట్ల కానీ దురుసుగా ప్రవర్తించడం, అడ్డుకోవడం లేదా బెదిరింపులకు పాల్పడడం ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం లాంటి వాటిని నేరాలుగా పరిగణించి ప్రస్తుత నూతన చట్టాలలో శిక్షను ఖరారు చేశారని ఆయన తెలిపారు. కొన్ని సెక్షన్లలో పోలీసులకు విపరీతమైన అధికారాలు ఇచ్చారని గతంలో రెవెన్యూ అనుమతితో కూడిన చట్టాలు అమలయ్యే అవకాశం ఉండగా ఇప్పుడు పోలీసులే నేరుగా చట్టాన్ని అమలు చేసే అవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఇది ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమేనన్నారు. గతంలో హత్యాయత్నం కేసుకు సంబంధించి నేరం జరిగిన తీరును బట్టి జీవిత ఖైదు లేదా పదేళ్లు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను మాత్రమే సంప్రదించి ఈ చట్టాలను అమలు చేశారని ఇందులో న్యాయ నిపుణులను కానీ బార్ కౌన్సిల్స్ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. కలెక్టర్ కొన్ని కేసులకు సంబంధించి స్పెషల్ ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్లను నియమించే అవకాశం ఉందని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఇది అధికార దుర్వినియోగానికి అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు. భారతీయ సాక్ష్యా సంహితలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించినసాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటున్నారని మారిన పరిస్థితుల్లో ఇది దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని మార్ఫింగ్ జరగడం ద్వారా నిందితులు తప్పించుకోవడం లేదా నేరస్తులు కానీ వారిని నేరస్తులుగా నిరూపించేఅవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్ ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన ను ఉన్నతాధికారి అనుమతితో చేసే అవకాశం ఉందని దీని వల్ల కొన్ని సందర్భాలలో కేసులు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గతంలో ఓ కేసు నమోదైనప్పుడు అప్పుడు బాధ్యతల్లో ఉన్న అధికారి మాత్రమే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆ స్థానంలో వచ్చిన అధికారులు ఎవరైనా సాక్ష్యం చెప్పే వెసులుబాటు కల్పించారని దీని వల్ల తీర్పుల్లో న్యాయం జరగక పోవచ్చునని ఆయన అన్నారు. ఈ సెమినార్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి. యర్రాబాబు, ఎస్కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఏఎల్ నాయకులు పట్టాభి, ఎస్ కె లతీఫ్, ఒరుగంటి శేషగిరిరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కారు డ్రైవింగ్

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి**

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలోని దాస్ నగర్ వెళ్లే మార్గంలో తాగి అతివేగంగా కారు నడుపుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారిని కారు ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో పద్మ (35), పోచవ్వ (64) అక్కడికక్కడే మృతి చెందారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రిషికా, ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో రిషికా పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను రెండవ ఆదివారం తల్లిదండ్రులు చూడడానికి వస్తారు. ఈ క్రమంలో వారిని అవుటింగ్ తీసుకువెళ్లి తినిపించి తిరిగి పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కారు నడుపుతున్న సతీష్ నిజామాబాద్ ఆర్టీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు నడుపుతున్న సతీష్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. సంఘటన స్థలాన్ని సీఐ సుధీర్ రావు తో పాటు ఎస్ఐ సతీష్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ను స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

# ముదిరాజ్ లను బీసీ- ఏ లో చేర్చాలి



పెద్దపల్లి ప్రతినిధి: ముదిరాజ్ లను బీసీ డి నుండి బీసీ- ఏ లో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బల్ల సత్తయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మత్స్య సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ పదవి ముదిరాజ్ లకే ఇవ్వాలని అన్నారు. మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మత్స్య సహకార సంఘాల ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ. 1వెయ్యి కోట్లు నిధులు విడుదల చేయాలని కోరారు. రాజకీయంగా పదవుల పంపకాల్లో ముదిరాజ్ లకు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశం లో వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, రాగినేడు, చీకురాయి సొసైటీ అధ్యక్షులు గుర్రాల లింగయ్య, పిడుగు రవి, ముదిరాజ్ అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు గరిగంటి నరసింహ రాజు, తీగల ధర్మపురి, కందుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కండిషన్స్... కమలానికి తలనొప్పులు

హైదరాబాద్, రాష్ట్రంలో వలసలు ఊపందుకున్నాయి. గులాబీ నేతలంతా క్యూ కట్టి హస్తం గూటికి చేరుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుంచి తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. రేవంత్ రెడ్డి వ్యూహాలు అన్నీ అనుకున్నట్టు ఫలిస్తున్నాయి. అయితే బీఆర్ఎస్ నుంచి వచ్చే నేతలంతా కాంగ్రెస్ పార్టీ వైపు మాత్రమే చూస్తున్నారు తప్ప......బీజేపీ వైపు మాత్రం ఎవరూ చూడడం లేదు. బీజేపీ కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన పార్టీ. ఇటీవలే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు ధీటుగా ఎనిమిది సీట్లు సాధించి, గతంలో కంటే ఎక్కువగా ఓటు శాతాన్ని పెంచుకుంది. ఇంత బలం కలిగిన ఆ పార్టీ......గులాబీ నేతలను ఎందుకు ఆకర్షించలేకపోయింది? బీజేపీలో నేతలు ఎందుకు చేరడం లేదని బీజేపీ శ్రేణులు తలలు పట్టుకుంటున్నాయి. కాగా ఇటీవలే మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం జరిగినప్పటికీ......అదంతా ప్రచారాలకే పరిమితం అయింది. బడా నేతలే కాకుండా క్షేత్ర స్థాయిలో ఉండే చిన్న కార్యకర్తలు కూడా బీజేపీలో చేరడానికి ఇష్టపడడం లేదని తెలుస్తోంది. కిషన్ రెడ్డి, బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ వంటి పెద్ద నేతలు ఉన్నా బీజేపీలోకి ఇతర పార్టీలు ఎందుకు చేరడం లేదని చర్చ మొదలైంది. అయితే కాంగ్రెస్, బీజేపీ సిద్ధాంతాలు, విధానాలు వేర్వేరుగా ఉంటాయి. బీజేపీలో చేరాలి అనుకునే నేతలు ముందుగా ఆయన పదవికి రాజీనామా చేసిన తరువాతనే ఆ పార్టీలో చేరాలి అనే షరతులు ఉంటాయి. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరాలి అనుకునే నేతలంతా తమ పదవికి రాజీనామా చేశాకే బీజేపీలో చేరాలనే కండిషన్ పెట్టడంతో నేతలు బీజేపీ వైపు చూడట్లేదని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీలో పెద్దగా ఇలాంటి షరతులు ఏమీ ఉండకపోవడంతో ఎమ్మెల్యేలు వరుస పెట్టి ఆ పార్టీలో చేరిపోతున్నారు. గతంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ పదవులకు రాజీనామా చేసిన తరువాతే ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. మొన్నటి దాకా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పని చేసిన కిషన్ రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రిగా అవకాశం దక్కడంతో తన వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సరైన నిర్ణయాలు తీసుకునే సారథి కరవయ్యారు. వీటన్నిటి దృష్ట్యా బీజేపీలో చేరడానికి నేతలు ఆసక్తి చూపడం లేదని విశ్లేషకులు అంటున్నారు. ఇకనైనా చేరికలపై దృష్టి పెంచి, సమర్థవంతమైన సారథిని



నియమించాలని బీజేపీ శ్రేణులు కోరుతున్నాయి. ఉండడానికి రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉన్నా.....వారిలో వారికే పడడం లేదనే ప్రచారాలు జరుగుతున్నాయి. ఇక ఎన్నికల ముందు రాష్ట్రంలో హడావుడి చేసిన బీజేపీ అగ్రనేతలు సైతం ఇప్పుడు పార్టీ పరిస్థితిని పెద్దగా పట్టించుకోవడం లేదట. ఇలాగైతే రాష్ట్రంలో బీజేపీ బలపడేది ఎలా అనే ప్రశ్నలు కార్యకర్తల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

# రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు..ఒక డ్రైవర్ మృతి

**పలువురికి గాయాలు**

హైదరాబాద్: తెలంగాణలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలు

మహబూబ్నగర్ జిల్లా బురెడ్డిపల్లి దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏపీలోని ధర్మవరం వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు డీసీఎంను ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్తో పాటు 15 మందికి గాయాలయ్యా యి. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులున్నారు.

మరో ప్రమాదం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గోమ్మూరు వద్ద జరిగింది. సోమవారం తెల్లవారుజామున కొత్తగూడెం నుండి భద్రాచలం వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికి అక్కడే మృతి చెందాడు.

# 5650 మందికి డబుల్ పెన్షన్లు

ఖమ్మం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5650 మంది అటు ఉద్యోగ పెన్షన్లతో పాటు.. ఆసరా పెన్షన్లు అందుకున్నట్లు సెర్ప్ నివేదికలో వెల్లడైంది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడినట్లు తేలింది. గత ఎన్నికల్లో అధికార మార్పిడితో గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తాజాగా రాష్ట్రంలో 5650 మందికి డబుల్ పెన్షన్లు అందుతున్నట్లు సెర్ప్ తన నివేదికలో వెల్లడించడం గమనార్హం. ప్రభుత్వ సర్వీసులో పని చేసి రిటైర్మెంట్ అయిన తర్వాత పొందుతున్న పెన్షన్ తో పాటు ఆసరా పెన్షన్ సైతం పొందుతున్న విడ్డూరం చోటు చేసుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్రంలో 5650 మందికి డబుల్ పెన్షన్లు అందుతుండగా ఇందులో 3826 మంది చనిపోయారు. ఇక 1826 మంది ఇప్పటికీ రెండు పెన్షన్లను పొందుతున్నట్లు సెర్ప్ తన నివేదికలో వెల్లడించింది. దీంతో మేల్కొన్న ప్రభుత్వం జూన్ నెల నుంచి ఈ పెన్షన్లను నిలిపివేసింది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 427 మందికి అక్రమ పెన్షన్లు అందుతున్నట్లు వెల్లడయ్యింది. వీరందరికీ ప్రభుత్వం ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో ఓ వృద్ధురాలికి ఒక లక్షా, 72 వేలు తిరిగి ఇవ్వాల్సిందిగా నోటీసు అందింది. అలాగే ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 139 మందికి సర్కారు నుంచి నోటీసులు అందాయి. నోటీస్ అందిన వారం రోజులలోపు స్పందించి పెన్షన్ రూపంలో పొందిన సొమ్మును తిరిగి చెల్లించకపోతే కేంద్ర, రాష్ట్రాల నుంచి పొందుతున్న సర్వీస్ పెన్షన్ నిలిపివేస్తామని హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ 200 మందికి నోటీసులు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆగస్టు నుంచి ఆసరా పెన్షన్లను 4వేలు, 6 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అక్రమంగా పొందుతున్న పెన్షన్లపై దృష్టి పెట్టింది. ఇలా అక్రమంగా పెన్షన్లు జారీ చేయడంలో కీలక పాత్ర పోషించిన అధికారులపై సైతం చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు

**కేటీఆర్ సెటైర్స్**

కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడినట్టు తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఉందని కేటీఆర్ సెటైర్స్ పేల్చారు. తాము వస్తే కొత్తగా అనేక పథకాలు ఇస్తామని, ఇదివరకే ఉన్న సంక్షేమ పథకాలకు వచ్చే డబ్బును పెంచుతామని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం లబ్దిదారుల నుండి సొమ్ముని వెనక్కి తీసుకుంటుందని విమర్శించారు. రాష్ట్రంలో లబ్దిదారుల నుండి సొమ్ముని వెనక్కు రాబట్టే వింత చేష్టలు కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏవో టెక్నికల్ రీజన్స్ చెబుతూ వేలాది మంది ఆసరా పెన్షన్ లబ్దిదారుల నుండి డబ్బును ప్రభుత్వానికి వెనక్కు పంపాలని నోటీసులు ఇస్తోందన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 80 ఏళ్ల ముసలమ్మ దాసరి మల్లమ్మకు ఆసరా పెన్షన్ కింద వచ్చిన ఒక లక్షా రూ.72 వేలు వెనక్కు కట్టాలని నోటీసులు ఇచ్చారు. ఒంటరి మహిళ, పక్షవాతంతో బాధపడుతూ ఉన్న ఇలాంటి వృద్ధుల నుంచి గతంలో కేసీఆర్ సర్కారు ఇచ్చిన ఆసరా పెన్షన్ సొమ్మును తిరిగి లాక్కోవడానికి రేవంత్ సర్కార్ ప్రయత్నించడం అమానవీయ వైఖరికి నిదర్శనం. కనుక వెంటనే పేదల మీద ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గపు చర్యలు మానుకోవాలి. లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలే తిరగబడతారు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# బాన్సువాడలో దొంగలు బాబోయ్

**- ఒకే రోజు రెండు షాపుల్లో చోరీ**

బాన్సువాడ (నసురుల్లాబాద్): దొంగలు ప్రజలను హడలెత్తిస్తున్నారు. వరుస చోరీలతో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పథకం ప్రకారం తాళాలు వేసిన షాపులను టార్గెట్ చేస్తున్నారు. బాన్సువాడ పట్టణ కేంద్రంలో ఆదివారం రాత్రి రెండు దుకాణాల శేటర్ లను పగలగొట్టి నగదు వీలైన వస్తువులను ఎత్తుకెళ్లారు. షేక్ వహాబ్ కు చెందిన సిమెంటు దుకాణం షట్టర్ తాళాలను పగలగొట్టి వేల రూపాయల నగదు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. అలాగే మహమ్మద్ హఫీజ్ కు చెందిన పాన్ షాప్ పగలగొట్టి నగదు విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఓ పథకం ప్రకారం దుండగులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రి దుకాణాలు వేసి ఉదయం తాళాలు తీసేందుకు వెళ్లగా అప్పటికి తాళాలు పగలగొట్టి ఉండడంతో దుకాణం యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. బాన్సువాడ టౌన్ సిఐ ఎం కృష్ణ వారి సిబ్బందితో దుకాణాలను పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు. పట్టణంలో నిత్యం పెట్రోలింగ్ నిర్వహించి దొంగలను పట్టుకొని చోరీ జరిగిన సొత్తు రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తుతున్న వర్షం..

**లోతట్టు ప్రాంతాలు జలమయం...**

నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్ బోయిన్పల్లి, ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేశారు. హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్ బోయిన్పల్లి, ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట సహా పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరా సైతం నిలిపివేశారు.

**వర్షాలపై మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి సమీక్ష...**

హైదరాబాద్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, ఈవీడీఎం టీమ్లతో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాళాల వద్ద ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని వారిని ఆదేశించారు. ఈదురు గాలులకు చెట్లు విరిగే ప్రమాదం ఉన్నందున ఈవీడీఎం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.

భారీ వర్షం పడుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితేనే ప్రజలు బయటకు రావాలని ఆమ్రపాలి కోరారు. డీఆర్ఎఫ్ బృందాలు సైతం రంగంలోకి దిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనవసరంగా ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని జీహెచ్ఎంసీ సిబ్బంది ప్రజలకి హెచ్చరికలు జారీ చేశారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వుండాలి

ఖమ్మం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ముజుముల్ ఖాన్, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ మాలతితో కలిసి విషజ్వరాలతో బాధ పడుతున్న స్టానిక రోగులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, చికిత్స పొందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విస్తృతంగా తిరిగి గ్రామంలో ఉన్న బురద రోడ్డులు, సైడ్ కాలువలు పరిశీలించి నీళ్ళు నిల్వ ఉండకుండా పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, కాంగ్రెస్ పార్టీ తాను అండగా ఉంటానన్నారు.

# 'ఒలింపిక్ గోల్డ్ మెడల్ కోసమే పుట్టిన'.. యువ బాక్సర్ నిషాంత్

ప్యారిస్ ఒలింపిక్స్ పోటీలకు పది రోజులే ఉంది. ఇప్పటికే విశ్వ క్రీడల కోసం భారత బృందం ప్యారిస్‌లో వాలిపోయింది. ఇక మిగిలిందల్లా విశ్వ క్రీడా సంబురం మొదల్వడమే.

ఈ నేపథ్యంలో భారత యువ బాక్సర్ నిషాంత్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈసారి తాను ఒలింపిక్ పతకం కొల్లగొడుతానని, కచ్చితంగా మెడల్‌తోనే తిరిగి వస్తానని నిషాంత్ వెల్లడించాడు. అమెరికా లెజెండరీ బాక్సర్ ఫ్లాయిడ్ మెవెదర్ జూనియర్ ) స్ఫూర్తిగా రింగ్‌లో చెలరేగిపోతానంటున్న ఈ యంగ్‌స్టర్ ఇంకా ఏం అన్నాడంటే..

'నేను ప్రపంచంలోనే గొప్ప బాక్సర్ అని నాకు తెలుసు. నేను ఎవరికీ భయపడను. ఇంకా చెప్పాలంటే.. నేను పుట్టిందే ఒలింపిక్ మెడల్ సాధించడం కోసం. నాకు ఎంతో ఇష్టమైన ఆలూ, పరోటాకు దూరమై ఇప్పటికీ మూడు నెలలు అయింది. అంతేకాదు పర్యటన సమయంలో ఎన్నో సుందర ప్రదేశాలు చూశాను. అయితే.. ఒలింపిక్స్‌లో బంగారు పతకం గెలిచినప్పుడే నా కష్టానికి ప్రతిఫలం ఉంటుంది. ఒకవేళ వెండి, కాంస్య పతకమైనా ఓకే. కానీ, నా లక్ష్యం మాత్రం పసిడి మీదే. ' అని నిషాంత్ ధీమాగా చెప్పాడు. విశ్వ క్రీడల్లో నిషాంత్ 71 కిలోల విభాగంలో తలపడనున్నాడు.

ఒలింపిక్స్ పేరు వింటే చాలు ఒకప్పుడు పతకాలను వేళ్ల మీద లెక్కించుకోవాల్సిన పరిస్థితి. హాకీలో తప్ప మరే ఆటలోనూ భారత్‌కు మెడల్స్ రాని రోజులే కళ్ల ముందు మెదులుతాయి. కానీ, ఈతరం



భారత అథ్లెట్లు పతకాల భరోసా ఇస్తున్నారు. ప్రపంచ స్థాయి ఆటగాళ్లకు తామేమీ తక్కువ కాదని చాటుతూ విశ్వ క్రీడల్లో పతకం గెలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. సిద్ధమయ్యారు.

జూలై 26వ తేదీన..

హాకీ, షూటింగ్, బ్యాడ్మింటన్, జావెలిన్ త్రో, బాక్సింగ్, రెజ్లింగ్, 3 వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌తో పాటు 400 మీటర్ల రీలే పరుగులో ఈసారి ఇండియాకు పతకాలు ఖాయమనిపిస్తోంది. జూలై 26వ తేదీన ప్యారిస్ వేదికగా ఒలింపిక్స్ షురూ కానుంది. 118 మందితో కూడిన భారత బృందం ఈసారి రికార్డు స్థాయిలో పతకాలు సాధించి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాలనే పట్టుదలతో ఉంది.

# శ్రీలంకతో టీ20 సిరీస్.. హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ బాధ్యతలు

న్యూఢిల్లీ: ఈనెల 27వ తేదీ నుంచి శ్రీలంకతో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు భారత జట్టు కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

ఇటీవల ముగిసిన టీ20 వరల్డ్‌కప్‌లో పాండ్యా కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. అయితే టీ20 సిరీస్ తర్వాత లంకతోనే జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు పాండ్యా దూరం కానున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల ఆగస్టులో జరగనున్న వన్డే సిరీస్‌కు పాండ్యా దూరంగా ఉంటారని బీసీసీఐ వర్గాల ద్వారా తెలిసింది.

రోహిత్ నేతృత్వంలోని టీమిండియాకు హార్దిక్ పాండ్యా వైస్ కెప్టెన్‌గా చేశాడని, అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని, మూడు టీ20లకు అందుబాటులో ఉంటాడని, ఆ మ్యాచ్‌లకు కెప్టెన్సీ చేపడుతాడని సీనియర్ బీసీసీఐ అధికారి ఒకరు ఇవాళ తెలిపారు. వెస్టిండీస్‌లో జరిగిన వరల్డ్‌కప్ తర్వాత టీ20 క్రికెట్‌కు రోహిత్ శర్మ గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే.

జూలై 27 నుంచి 30 వరకు పల్లెకిలో మూడు టీ20 మ్యాచ్‌లు



జరగనున్నాయి. ఇక ఆగస్టు 2 నుంచి 7 వరకు కొలంబోలో మూడు వన్డేలు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లకు చెందిన బృందాలను త్వరలో ప్రకటించనున్నారు. టీ20లకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలను గిల్ లేదా సూర్యకు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. వన్డేలకు రోహిత్, పాండ్యా దూరంగా ఉండనున్న నేపథ్యంలో.. కేఎల్ రాహుల్ లేదా గిల్‌కు బాధ్యతలు దక్కే అవకాశాలు ఉన్నాయి.

# ఫీల్డర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు గెలుచుకున్న రింకూ సింగ్.. అవార్డు అందజేసిన వీవీఎస్ లక్ష్మణ్

హరారే: జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌ను గిల్ నేతృత్వంలోని టీమిండియా 4-1 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ టోర్నీలో అద్భుతంగా ఫీల్డింగ్ చేసిన రింకూ సింగ్‌కు ఫీల్డర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది.

తన ఎక్స్ అకౌంట్‌లో బీసీసీఐ దీనికి సంబంధించిన వీడియోను పోస్టు చేసింది. ఫీల్డింగ్ కోచ్ సుభాదీప్ ఘోష్.. సిరీస్‌లో ఫీల్డింగ్ గురించి మాట్లాడారు. భారత క్రికెట్ జట్టులో ఫీల్డింగ్ చాలా కీలకమైందని, చాలా ఉన్నత ప్రమాణాలతో క్రికెటర్లు ఫీల్డింగ్ చేస్తున్నారని, ఈ రంగంలో మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించాలని, సంప్రదాయం ప్రకారం ఫీల్డింగ్ మెడల్ ఇస్తామని, ఫీల్డింగ్ ద్వారా ప్రభావాన్ని చూపిన ఆటగాడికి ఫీల్డర్ ఆఫ్ సిరీస్ అవార్డు దక్కుతుందని దిలీప్ తెలిపాడు. జింబాబ్వేతో సిరీస్‌లో ఫీల్డర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు రింకూ సింగ్‌కు దక్కుతుందని ఘోష్ ప్రకటించారు. కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ చేతుల మీదుగా



రింకూకు అవార్డును అందజేశారు. అందరితో ఆడడం ఎంజాయ్ చేశానని, ఇది నాకు అయిదో సిరీస్ అని, దీన్ని బాగా ఎంజాయ్ చేశానని, బ్యాటింగ్-ఫీల్డింగ్‌ను ఇష్టపడుతానని రింకూ తెలిపాడు.

# కాంగ్ యాట్సేపై తెలంగాణ గిరిజన కుర్రాడు యశ్వంత్

లేహ్: లధక్ రీజియన్‌లో ఉన్న కాంగ్ యాస్టే (6,250 మీటర్ల ఎత్తు) పర్వతాన్ని తెలంగాణ గిరిజన కుర్రాడు భూక్యా యశ్వంత్ విజయవంతంగా అధిరోహించాడు. మహబూబాబాద్‌లోని మరిపెడ బంగ్లా మండలం భూక్య తండాకు చెందిన యశ్వంత్.. 8 రోజుల్లో ఈ సాహసయాత్రను పూర్తిచేశాడు. అత్యంత కఠిన సవాళ్లతో కూడిన ఈ యాత్రను పూర్తిచేసిన యశ్వంత్.. ఎవరెస్ట్‌ను అధిరోహించడం తన లక్ష్యమని తెలిపాడు. పారిస్: ఒలింపిక్స్‌లో భారత బ్యాడ్మింటన్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్-చిరాగ్ జోడీకి సులువైన డ్రా ఎదురైంది. గ్రూప్-సీలో మూడో సీడ్‌గా బరిలోకి దిగబోతున్న భారత స్టార్ ద్వయం.. ఫజల్ అల్ఫియన్-మహ్మద్ రియాన్ (ఇండోనేషియా), 31వ ర్యాంకు జర్మన్ జోడీ మార్క్ లమ్స్‌ఫస్-మర్విన్ సీడెల్, 43వ ర్యాంకు ఫ్రెంచ్



షట్లర్లు లుకాస్ కొర్వి-రొనాన్ లబర్‌తో పోటీపడనున్నారు.

# పాకిస్థాన్‌లో జూనియర్ బుమ్రా..

టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా విలక్షణమైన బౌలింగ్ యాక్షన్‌ను అనుకరించడం ఎవరికైనా చాలా కష్టం. ఎందుకంటే షార్ట్ రనప్‌తో అతడి బౌలింగ్ యాక్షన్ చాలా వైవిధ్యంగా ఉంటుంది.

కానీ, ఓ పాకిస్థాన్ పిల్లాడు అచ్చం బుమ్రా మాదిరిగానే బౌలింగ్ చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు. అచ్చుగుద్దినట్లుగా బుమ్రాలా పరుగెత్తడమే కాకుండా యార్కర్లు కూడా సంధిస్తున్నాడు. బంతిపై ఏమాత్రం నియంత్రణ కోల్పోకుండా అనుకున్నవిధంగా బౌలింగ్ చేస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న దీనికి సంబంధించిన వీడియో పాక్ మాజీ ఆటగాడు వసీం అక్రమ్ కంటపడింది.

ఈ పిల్లాడు బౌలింగ్‌కు అక్రమ్ ఫిదా అయిపోయాడు. "పిల్లాడి బౌలింగ్ అద్భుతంగా ఉంది. అచ్చం జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్ యాక్షన్‌ను అనుకరిస్తూ బంతిపై నియంత్రణతో బౌలింగ్ చేస్తున్నాడు. వీడియో ఆఫ్ ది డే" అనే క్యాప్షన్‌ను జత చేస్తూ వసీం అక్రమ్ ఎక్స్ (ట్విటర్)లో రీ పోస్టు చేశాడు. ఈ వీడియోను చూసిన కొంతమంది నెటిజన్లు "జూనియర్ బుమ్రా వచ్చేశాడోచ్", "పాకిస్థానీ బుమ్రా" అని కామెంట్లు పెడుతున్నారు.

# టీ20 సారథ్యం: హార్దిక్ కాదట.. అతడివైపే టీమ్ మొగ్గు!

టీమ్‌ఇండియా ఇటీవల టీ20 ప్రపంచకప్‌ను గెలిచింది. ఆ వెంటనే సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, జడేజా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే.

దీంతో ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు కెప్టెన్ వేటలో పడింది బీసీసీఐ. ఈ ఫార్మాట్‌లో సుదీర్ఘ కాలం టీమ్‌ఇండియాను ముందుండి నడిపిస్తున్నాడు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య. ఇటీవల టీ20 ప్రపంచకప్‌లో వైస్‌కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. అయితే.. టీ20 ఫార్మాట్‌లో సారథ్యం విషయంలో హార్దిక్ కాకుండా మరో ఆటగాడి వైపు జట్టు యాజమాన్యం మొగ్గు చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

కొత్త సారథిగా హార్దిక్ కంటే సూర్యకుమార్ ఉత్తమమని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో హార్దిక్ ఆల్‌రౌండర్‌గా ఆకట్టుకున్నాడు. బంతితోపాటు బ్యాట్‌తోని రాణించి.. జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే.. అతడి ఫిట్‌నెస్‌పై ఆందోళన చెందుతున్న సెలక్టర్లు.. లాంగ్ టర్మ్ కెప్టెన్‌గా సూర్య వైపు చూస్తున్నట్లు సమాచారం.

"ఇది చాలా సున్నితమైన అంశం. చర్చించాల్సిన విషయం. హార్దిక్‌కు ఫిట్‌నెస్ సమస్య ఉంది. అయితే.. టీమ్‌ఇండియా ఐసీసీ ట్రోఫీ నెగ్గడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. ఇక సూర్య విషయానికొస్తే.. అతడి కెప్టెన్సీ స్టైల్ బాగుంటుంది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఇతర ఆటగాళ్లతో



అతడికి చక్కటి అనుబంధం ఉందని మాకు ఫీడ్‌బ్యాక్ ఉంది" అని బీసీసీఐ అధికారి తెలిపాడు. గత ఏడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు సూర్య సారథిగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

జింబాబ్వేపై టీ20 సిరీస్ నెగ్గిన టీమ్‌ఇండియా.. జులై 27 నుంచి శ్రీలంక పర్యటన చేపట్టనుంది. కోచ్‌గా గౌతమ్‌గంభీర్‌కు ఇది తొలి సిరీస్. టీ20 ఫార్మాట్‌కు కెప్టెన్ విషయంలో గంభీర్ నిర్ణయం కీలకం కానుంది. ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా ఎవరిని నియమిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది.

# శ్రీలంకతో జరిగే టీ20 సిరీస్‌లో కెప్టెన్ అతనే..!

శ్రీలంకతో జరగనున్న సిరీస్‌కు సంబంధించి కీలక సమాచారం అందుతోంది. ఈ టూర్‌లో టీమిండియా మూడు టీ20ల సిరీస్‌తో పాటు 3 వన్డే మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రీలంకతో జూలై 27 నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల టీ20 క్రికెట్ సిరీస్‌లో స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా.. రానున్న టీ20 సిరీస్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కాగా.. భారత జట్టును టీ20 ఛాంపియన్‌గా నిలిపిన తర్వాత రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.. అయితే.. హార్దిక్ పాండ్యా భారత టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడు శ్రీలంకతో సిరీస్ కు హార్థిక్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడు.. ఈ క్రమంలో అతను కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

టీ20 సిరీస్ జూలై 27 నుంచి 30 వరకు పల్లెకెలెలో.. వన్డేలు ఆగస్టు 2 నుంచి 7 వరకు కొలంబోలో జరగనున్నాయి. మరికొద్ది రోజుల్లో జట్టును ప్రకటించనున్నారు. వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ లేదా సూర్యకుమార్ యాదవ్ ను నియమించనున్నారు. అయితే.. వన్డే సిరీస్‌కు సంబంధించి, వ్యక్తిగత కారణాల వల్ల పాండ్యా విరామం కోరాడని.. దాని గురించి రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మకు తెలియజేసినట్లు బీసీసీఐ అధికారి తెలిపారు. ఇదిలా ఉంటే.. అంతర్జాతీయ క్రికెట్ ఆడకపోతే స్టార్ క్రికెటర్లందరూ దేశవాళీ క్రికెట్ ఆడాల్సి ఉంటుందని బీసీసీఐ సెక్రటరీ జై షా స్పష్టం చేశారు. కేవలం రోహిత్, విరాట్



కోహ్లి, జస్ప్రీత్ బుమ్రాలకు మినహాయింపు ఇచ్చారు. ఆగస్టులో జరిగే దులీప్ ట్రోఫీలో మిగతా టెస్ట్ స్పెషలిస్టులందరూ కనీసం ఒక్క మ్యాచ్ అయినా ఆడాలని బీసీసీఐ కోరుతోంది. ఆ తర్వాత బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లు ఆడాల్సి ఉంటుంది.

శ్రీలంకలో భారత పర్యటన షెడ్యూల్

27 జూలై %-% 1వ టీ20, రాత్రి 7 గంటలకు, పల్లెకెలె

28 జూలై %-% 2వ టీ20, రాత్రి 7 గంటలకు, పల్లెకెలె

జూలై 30 %-% 3వ టీ20, రాత్రి 7 గంటలకు, పల్లెకెలె

2 ఆగస్టు %-% 1వ వన్డే, మధ్యాహ్నం 2.30, కొలంబో

4 ఆగస్టు %-% 2వ వన్డే, మధ్యాహ్నం 2.30, కొలంబో

ఆగస్టు 7 %-% 3వ వన్డే, మధ్యాహ్నం 2.30, కొలంబో

# హార్దిక్ పాండ్యా సంచలన నిర్ణయం.. ఆ వన్డే సిరీస్ నుంచి ఔట్?

టీ20 వరల్డ్‌కప్‌తో పాటు జింబాబ్వే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు.. ఇప్పుడు శ్రీలంక టూర్‌కు సిద్ధమవుతోంది. ఆ జట్టు మూడేసి మ్యాచ్‌లు చొప్పున టీ20, వన్డే సిరీస్‌లు ఆడబోతోంది.

తొలుత జులై 27వ తేదీ నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. ఇది ముగిసిన వెంటనే వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. అయితే.. ఈ వన్డే సిరీస్‌కు టీ20 వరల్డ్‌కప్ విజేత హార్దిక్ పాండ్యా అందుబాటులో ఉండడని సమాచారం. అవును.. మీరు చదువుతోంది అక్షరాల నిజం.

ఈ విషయంపై బీసీసీఐ అధికారి మాట్లాడుతూ.. "శ్రీలంకతో జరగబోయే వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యా అందుబాటులో ఉండటం లేదు. వ్యక్తిగత కారణాల వల్ల అతడు విరామం తీసుకుంటున్నాడు. అంతే తప్ప.. ఫిట్నెస్ లోపాలేమీ లేవు" అని చెప్పారు. అయితే.. అంతకుముందు జరిగే టీ20 సిరీస్‌కు అతడు అందుబాటులోనే ఉంటాడని, భారత జట్టుకి నాయకత్వం వహిస్తాడని ఆయన క్లారిటీ ఇచ్చాడు. "రోహిత్ శర్మ సారథ్యంలో టీ20 వైస్-కెప్టెన్‌గా పాండ్యా ఉన్నాడు. ఇప్పుడు శ్రీలంకతో జరిగే టీ20 సిరీస్‌లో టీమిండియాకు నాయకత్వ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు" అని చెప్పుకొచ్చారు. హార్దిక్ పాండ్యా చాలా ఫిట్‌గా ఉన్నాడని ఆ అధికారి మరోసారి ధృవీకరించారు.

ఈ నేపథ్యంలోనే.. వన్డే సిరీస్‌లో భారత జట్టుకి ఎవరు నాయకత్వం




వహించనున్నారనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా వంటి సీనియర్ ఆటగాళ్లు కూడా విరామం తీసుకున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా పాండ్యా సైతం విరామం కోరిన తరుణంలో.. వన్డే సిరీస్‌లో కెప్టెన్ ఎవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే.. కేఎల్ రాహుల్ పేరు తెరమీదకి వచ్చింది. అతడు గతంలో సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత జట్టుకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. కాబట్టి.. ఈ సిరీస్‌లోనూ అతనికే ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# కోహ్లి మారిపోయాడు.. ఫోన్ నెంబర్ కూడా తెలియదు!

భారత జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై టీమిండియా వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశాడు.

స్టార్ క్రికెటర్‌గా ఎదిగిన తర్వాత విరాట్ పూర్తిగా మారిపోయాడని, ఆటగాళ్ల స్నేహానికి దూరమయ్యాడన్నాడు. ప్రస్తుత జట్టులో అతడికి ఎక్కువగా స్నేహితులు లేరని, ఎప్పటినుంచో తాము కలిసి ఆడుతున్నా విరాట్ ఫోన్ నెంబర్ కూడా తనకు తెలియదన్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం ఏ మాత్రం మారలేదని అమిత్ మిశ్రా పేర్కొన్నాడు. తాజాగా యూట్యూబర్ శుభంకర్ మిశ్రా ఇంటర్వ్యూలో పాల్గొన్న అమిత్ మిశ్రా.. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మకు మధ్య ఉన్న తేడాను వివరించాడు. 'నేను అబద్ధాలు చెప్పను. క్రికెటర్‌గా విరాట్ కోహ్లిని నేను చాలా గౌరవిస్తాను. కానీ ఒకటి.. ఎందుకు కోహ్లీకి చాలా తక్కువ మంది స్నేహితులు ఉన్నారు. కోహ్లి, రోహిత్ శర్మ వ్యక్తిత్వాలు బిన్నంగా ఉంటాయి. నేను రోహిత్‌ని మొదటిసారి కలిసినప్పుడు ఎలా ఉన్నాడో.. ఇప్పటికీ కలిసినా అలానే ఉంటాడు. కానీ కోహ్లి మాత్రం పూర్తిగా మారిపోయాడు. నేను ఇన్నేళ్లుగా భారత జట్టులో భాగం కాలేదు. అయినా కూడా రోహిత్‌ను ఐపీఎల్‌లో లేదా మరేదైనా ఈవెంట్‌లో కలిసినప్పుడు నాతో సరదాగా మాట్లాడుతుంటాడు' అని తెలిపాడు.

'నేను, రోహిత్ ఒకరిపై ఒకరం జోక్స్ వేసుకుంటాం. అతను స్టార్ ప్లేయర్‌గా ఉన్నా తనతో నా ర్యాపో బాగానే ఉంది. రోహిత్ కెప్టెన్‌గా ఉన్నాడు,



ప్రపంచకప్ గెలిచాడు, ఐదు ఐపీఎల్ టైటిల్స్ గెలిచాడు. అయినా రోహిత్ మారిపోలేదు. విరాట్ కోహ్లి మాత్రం చాలా మారాడు. మేం ఇద్దరం మాట్లాడుకోక చాలా రోజులయ్యింది. ఫేమ్, డబ్బు వచ్చినప్పుడు చాలా మంది తమ సన్నిహితులను మర్చిపోతుంటారు. నేను అలా కాదు. 14 ఏళ్ల నుంచి నాకు చీకూ (కోహ్లి పెట్ నేమ్) తెలుసు. రాత్రి పూట సమోసాలు, పిజ్జా తినేవాడు. కోహ్లి, చీకూకు చాలా తేడా ఉంది. ఎప్పుడైనా నన్ను కలిస్తే చీకూలా కాకుండా కోహ్లీలా వ్యవహరిస్తాడు' అని అమిత్ మిశ్రా చెప్పుకొచ్చాడు. కోహ్లి సారథ్యంలో అమిత్ 9 టెస్టులు, 7 వన్డేలు, 2 టీ20లు ఆడాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**